epaper.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



20

యాదాద్రి భువనగిరి

బుధవారం ● 23 ఆగస్టు 2017

జాతీయరహదారిపై భద్రత డొల్ల

పనిచేయని సీసీ కెమెరాలు

కనిపించని పెట్రోలింగ్ వాహనాలు

రాత్రి వేళ వెలగని వీధి లైట్లు

రెచ్చిపోతున్న దోపిడీదారులు

యథేచ్ఛగా నిషేధిత సరుకుల రవాణా

అక్రమాలకు అడ్డాగా హైవే

దేశంలోనే పెద్ద జాతీయ రహదారుల్లో ఒకటైన ఎన్‌హెచ్-65పై భద్రత కరువైంది. పోలీసుల నిఘా జాడ లేకపోవడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. నిషేధిత సరుకుల రవాణా, స్మగ్లింగ్, దారిదోపిడీలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. జాతీయ రహదారిపై భద్రత కోసం పోలీసులు ఏర్పాటు చేశామని చెప్పుకుంటున్న సీసీ కెమెరాలు, హైమాస్ట్ లైట్లు చాలా చోట్ల పనిచేయడం లేదు. దీనికితోడు హైవేపై పోలీస్ పెట్రోలింగ్ కూడా రద్దు చేయడంతో ఇక దోపిడీదారులకు అడ్డూ అదుపూలేకుండా పోయింది. ప్రయాణికుల్లా నమ్మించి వాహనదారుల నుంచి భారీగా సొత్తును దోపిడీ చేస్తున్నారు. దీంతో జాతీయ రహదారిపై ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకే పరిస్థితి ఏర్పడుతోంది.

● చౌటుప్పల్, చౌటుప్పల్ రూరల్



హైవేపై జాడలేని నిఘా



తాజాగా హైజాక్ చేసిన సిగరెట్ల కంటెయినర్



హైవేపై పట్టుబడ్డ గంజాయి(ఫైల్)

వివరాలు 8లో...

పర్యావరణం సరే...
పరిహారం మాటేంటి..?

ప్రశ్నించిన నిర్వాసితులు

నిర్వాసితులకు అండగా ఉంటాం: ప్రజాప్రతినిధులు

కాళేశ్వరం ప్రాజెక్టుపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

2



బస్వాపూర్ రిజర్వాయర్ సామర్థ్యం పెంచవద్దని లప్పానాయక్ తండా నిర్వాసితుల ప్లకార్డుల ప్రదర్శన

WhatsApp

అభూత కల్పనల
వేదిక..

సామాజిక మాధ్యమాల్లో.. గోబెల్స్‌ను మించిన ప్రచారాలు

అసత్య సమాచారాలతో సామాన్యుడి అయోమయం

వివరాలు 20 లో...

ఆంధ్రజ్యోతి పరిశీలన

అవినీతికి
ప్లానింగ్

మునిసిపల్ టౌన్ ప్లానింగ్‌లో అక్రమాలు

అన్నీ ఉన్నా ఏదో సాకుతో పెండింగ్

చేయి తడిపితేనే అనుమతి లేదంటే ఫైల్ కిందికే



వివరాలు స్ప్రెడ్ లో...

భూమిపై రిజర్వాయర్లు భద్రమేనా?



దేశంలో ఎక్కడైనా నదీ ప్రవాహక ప్రాంతాలు, వాగులు, లోయల ప్రాంతాలో నీటి ప్రవాహాలు ఉన్న చోట రిజర్వాయర్లు నిర్మించారు. ప్రస్తుతం వాగులు కూడ లేని ప్రాంతంలో 50 టీఎంసీలు, 11.89 టీఎంసీల రిజర్వాయర్లు నిర్మాణం చేస్తున్నారు. అయితే ఇవి భద్రతా పరంగా పటిష్టంగా ఉంటాయా? అన్న అంశపై శాస్త్రీయ అధ్యయనం చేయాలన్నారు. గోదావరి జలాలను గొలుసుకట్టుగా షామీర్‌పేట వంటి చెరువులకు మళ్లిస్తే ఎక్కువ ప్రయోజనం. నవాబుల కాలం నుంచి సాగు చేస్తున్న రైతులకు న్యాయం చేయాలి.

- కొమ్మిడి నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, భువనగిరి

మీ వెంట నేనుంటా..



కరువుతో అలమటిస్తున్న.. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లు, కాళేశ్వరం ప్రాజెక్టుతో సస్యశ్యామలం అవుతుంది. భూగర్భ మట్టం పెరుగుతుంది. ఫ్లోరిన్ పీడ విరుడగ అవుతుంది. రైతులకు న్యాయంగా పరిహారం అందించాలని సీఎం ఆలోచన. ముంపు గ్రామాల స్థానంలో పునరావాస గ్రామం నిర్మిస్తాం. నవాబుల భూముల్లో కబ్జా ఉన్న రైతులకు కూడ పరిహారం అందించడానికి రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకోవాలి. నేను నేను మీతోను ఉంటా. నిర్వాసితులు అధైర్యపడవద్దు.

- పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే, భువనగిరి

పరిహారమా? పరిహాసమా?



కాళేశ్వరం ప్రాజెక్టుపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న కలెక్టర్

ఆంధ్రజ్యోతి, యాదాద్రి: గోదావరి జలాలకు జిల్లాకు మళ్లించడానికి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్మించనున్న బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్ల పర్యావరణ ప్రభావాలపై అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి మంగళవారం భువనగిరి మండలం రాయిగిరిలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని గంధమల్ల, వీరారెడ్డిపల్లి గ్రామస్థులు బహిష్కరించగా.. బస్వాపూర్ ప్రాంత ప్రజలు, నీటిపారుదల రంగం నిపుణులు, 12మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పక్షాలు పాల్గొని తమ అభిప్రా యాలు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణానికి.. పర్యావరణ ప్రభావంపై తమకేమీ అభ్యంతరాలు లేవని, నిర్వాసితులకు పునరావాసంపై స్పష్టత ఇవ్వాలని అందరూ కోరారు. ఈ ప్రాజెక్టుపై పర్యావరణ ప్రభావంపై ఏ ఒక్కరూ తమ అభిప్రాయాన్ని వెల్లడించలేదు. నిర్వాసితులకు న్యాయం చేయనట్లయితే బాధతులకు అండగా నిలిచి పోరాడతామని పలువురు నాయకులు స్పష్టం చేశారు.

బహిష్కరించిన గంధమల్ల గ్రామస్థులు..

తుర్కపల్లి: కాళేశ్వరం ప్రాజ్ట్‌పై మంగళవారం యాదాద్రి జిల్లా పరిధిలోని రాయగిరి గ్రామంలోని సోమ రాధాకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ మండలంలోని గంధమల్ల గ్రామస్థులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి బహిష్కరించారు. తమ గ్రామాల్లో గ్రామసభ ఏర్పాటు చేసి ప్రభుత్వం ఇచ్చే పరిహారంపై స్పష్టమైన హామీ ఇచ్చి పునరావాస చర్యలు చేపట్టిన తరువాతే భూ సేకరణ ప్రక్రియ చేపట్టాలని భూ నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. పునరావాస చర్యలు చేపట్టాకే భూ సేకరణ చేయాలిరిజర్వాయర్ నిర్మాణంతో ఊరు భూములు అన్ని పోతున్నాయి. కాబట్టి ప్రభుత్వం భూ నిర్వాసితులకు పునరావాస చర్యలు చేపట్టాకే భూ సేకరణ పనులు చేపట్టాలి.

పోలీసుల నడుమ ప్రజాభిప్రాయ సేకరణ

భువనగిరి రూరల్ : కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి వస్తున్న పలువురిని పోలీసులు లోపలికి అనుమతించలేదు. దీంతో ప్రభుత్వ అధికారుల, పోలీసుల వైఖరిని నిరసిస్తూ ఫంక్షన్‌హాల్ ఎదుట నిర్వాసితులు బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసుల ప్రహారా నడుమ ముంపు గ్రామాలకు సంబంధం లేని వ్యక్తుల నుంచి కలెక్టర్ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిందని నిర్వాసితులు ఆరోపించారు. వారికి మద్దతుగా సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.హాల్‌లో స్థలం లేదని నిర్వాసితులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం జరిగింది. ప్రభుత్వ తీరును నిరసిస్తూ పలువురు నిర్వాసితులు అక్కడినుంచి వెళ్లిపోయారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహాంగీర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల నర్సింగరావు, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు, ముంపు గ్రామాల నిర్వాసితులు ఉన్నారు.



బస్వాపూర్ రిజర్వాయర్ సామర్థ్యం పెంచవద్దని నిర్వాసితుల ప్లేకార్డుల ప్రదర్శన

ప్రజాభిప్రాయ సేకరణ సక్సెస్..

- కలెక్టర్ అనితా రామచంద్రన్

యాదాద్రి, ఆంధ్రజ్యోతి: కాళేశ్వరం ప్రాజెక్టుపై జిల్లాలోని ప్రభావిత ప్రాంతంలో నిర్వహించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ విజయవంతమైనట్టు కలెక్టర్ అనితా రామచంద్రన్ తెలిపారు. 93మంది అభిప్రాయాలను, సూచనలు, సలహాలు అందజేశారన్నారు. వీటిని క్రోడీకరించి కేంద్ర ప్రభుత్వ పర్యావరణం, అటవీవాతావరణ మంత్రిత్వ శాఖకు నివేదిస్తామన్నారు.

ఈ ప్రజాభిప్రాయ సేకరణ కేవలం పర్యావరణంపై మాత్ర మేనని, భూసేకరణ, నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసానికి కాదన్నారు. వీటికోసం రెవెన్యూ,ఇరిగేషన్ అధికారులు ముంపు గ్రామాలకు వెళ్లి నిర్వాసితులతో చర్చించి నిబంధనల ప్రకారం పరిహారం ఇవ్వడానికి తీసుకుంటారన్నారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో నిర్వాసితులకు న్యాయం చేయాలని, ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయాలని పలువరు సూచించారు. ప్రాజెక్టుతో ఈప్రాంతంలో జల వనరులు పెరుగుతాయి. ఈ అభిప్రాయ సేకరణలో ప్రాజెక్టు ఈఈ హరిరాం, కాలుష్య నియంత్రణ మండలి అధికారి జవహర్, జేసీ రవినాయక్, ఆర్డీవో భూపాల్‌రెడ్డి, ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, ఎలిమినేటి కృష్ణారెడ్డి పలు మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తాతలు.. తండ్రులు సాగుచేసే భూములు ప్రాజెక్టులో మునిగిపోతున్నాయి..



గ్రామంలో ఆడబిడ్డల పెళ్లి చేయాలన్నా భూములు ఎవరూ కొనడం లేదు. ఈ ఊరికి పిల్లను ఇవ్వడం లేదు... భూమికి..భూమి ఇవ్వాలి.. ఊరుకు సమీపంలోనే పునరావాస గ్రామం ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పించాలి. ఆ తర్వాతే పనులు మొదలు పెట్టాలి.

- వల్లబోజు నర్సింహాచారి, నిర్వాసితుడు, బీఎన్ తిమ్మాపూర్

నిర్వాసితులు లేకుండా ప్రజాభిప్రాయ సేకరణా?



రిజర్వాయర్ల నిర్మాణంతో నష్టపోతున్న రైతులు లేకుండా రాజకీయ పార్టీలు, అధికారులతో ప్రజాభిప్రాయ సేకరణకు అర్థంలేదు. పట్టణానికి దూరంగా అభిప్రాయ సేకరణ చేయడం సరికాదు. దీనిని వాయిదా వేసి కలెక్టరేట్ ఆవరణలో నిర్వాసితులతోనే సమావేశం ఏర్పాటు చేయాలి.

- నర్ల నర్సింగరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదరి

60 ఏళ్ల కల సాకారం...



ఆలేరు, భువనగిరి ప్రాంత ప్రజల 60 ఏళ్ల కలలు బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లతో సాకారమతున్నాయి. నిర్వాసితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం, ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు ముందుంటారు. రాజకీయ పార్టీలు నిర్వాసితులను అధైర్య పర్చవద్దు. ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేయాడానికి సహకరించాలి. నిర్వాసితుల్లో భరోసా నింపాలి.

- గొంగిడి మహేందర్‌రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర రైతు నాయకుడు

రిజర్వాయర్లతో పర్యావరణం మెరుగుపడుతుంది..



రాష్ట్రంలోనే అతి తక్కువ వర్షపాతంతో ఏడారిగా మారుతున్న యాదాద్రి భువనగిరి జిల్లాలో బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్ల నిర్మాణంతో పర్యావరణ పరంగా ఎంతో మేలు జరుగుతుంది. రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు వస్తుంటాయి.. పోతుంటాయి. రైతులకు, ఈ ప్రాంత భా వి తరాలకు మేలు జరిగే ప్రాజెక్టుకు అందరూ సహకరించాలి. ముంపు ప్రభావిత గ్రామాల ప్రజలకు నూరు శాతం న్యాయం చేస్తాం..

- డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, ఎంపీ, భువనగిరి

అడ్డంకులు సృష్టించవద్దు...



జిల్లాకు నీళ్లొస్తే ప్రజలకు సంతోషమే. నిర్వాసితులను సంతృప్తిపర్చే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మేము నిర్వాసితులకు అండగా ఉంటా. ప్రాజెక్టులు ఆకాశంలో కట్టలేం. అందుకే కొంత మంది తమ భూములను, ఇళ్లను త్యాగం చేయాల్సి ఉంది. రాజకీయ పార్టీలు అండగా ఉండాలి..తప్ప అడ్డంకులు సృష్టించవద్దు.

- కర్నె ప్రభాకర్, ఎమ్మెల్సీ

నిర్వాసితులకు అండగా ఉంటాం..



కరువు ప్రాంతాల్లో ప్రాజెక్టుల నిర్మాణంతో పర్యావరణానికి మేలు జరుగుతుంది. ఈ ప్రాంతమంతా సస్యశ్యామలవుతుంది. కాలుష్యంతో కూడిన మూసీకి గోదావరి జలాలు అనుసంధానం చేయడం ద్వారా జిల్లాకు మరింత మేలు జరుగుతుంది. అయితే నిర్వాసితులకు న్యాయమైన నష్టపరిహారం, పునరావాసం కోసం అండగా ఉంటాం.

- ఎలిమినేటి కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ

ఫ్లోరిన్ సమస్య పరిష్కారం...



ఇక్కడికి గోదావరి నదీ జలాలను తీసుకువస్తే కరువుతో పాటు ఫ్లోరిన్ సమస్య పరిష్కారమవుతుంది. కాళేశ్వరం ప్రాజెక్టు మెట్టప్రాంతంలోని యాదాద్రి జిల్లాకు వరప్రదాయని. పర్యావరణంపై ఎటువంటి ప్రభావం చూపే పరిస్థితి లేదు.

- మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి

పరిహారంపై స్పష్టత ఇవ్వాలి...



ఈ ప్రాంతంలో ప్రాజెక్టుల కోసం పోరాడాం. అయితే నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం న్యాయం చేయాలి. భూమికి, భూమికి, మెరుగైన పునరావాస సదుపాయాలు కల్పించాలి. రిజిస్ట్రేషన్ విలువలకు, బహిరంగ మార్కెట్ ధరలకు చాలా వ్యత్యాసం ఉన్నందున బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం చెల్లించాలి.

- గోద శ్రీరాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి

ముంపు గ్రామాల్లో సభలు నిర్వహించాలి...



నిజమైన నిర్వాసితులకు అందుబాటులో లేకుండా దూరంగా ప్రజాభిప్రాయ సేకరణ పెట్టడం సరికాదు. నిర్వాసితులకు మనోధైర్యం కలుగడానికి ముంపు గ్రామాల్లోనే సభలు, సమావేశాలు ఏర్పాటు చేయాలి. దీనిపై కలెక్టర్ స్పష్టమైన హామీ ఇవ్వాలి. నిర్వాసితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయడాలి. నిర్వాసితుల సాధక బాధకాలకు ప్రభుత్వం పట్టించుకోవాలి.

- ఎలిమినేటి సందీప్ రెడ్డి, టీడీపీ జిల్లా కన్వీనర్

పునరావాస చర్యలు చేపట్టాకే భూ సేకరణ చేయాలి



రిజర్వాయర్ నిర్మాణంతో ఊరు భూములు అన్ని పోతున్నాయి. కాబట్టి ప్రభుత్వం భూ నిర్వాసితులకు పునరావాస చర్యలు చేపట్టాకే భూ సేకరణ పనులు చేపట్టాలి. అందుకే రాయగిరి సమావేశానికి గ్రామం నుంచి ఎవరూ వెళ్లలేదు.

- చంద్రయ్య, పీఏసీఎస్ వైస్‌చైర్మన్

సిగరెట్లు ఏమయ్యాయ్?

దుండగుల కోసం రాచకొండ పోలీసుల ముమ్మర వేట


చౌటుప్పల్‌లో దోపిడీ దొంగలు దారిమళ్లించిన కంటైనర్ (ఫైల్ ఫొటో)

చౌటుప్పల్ రూరల్: అపహరణకు గురైన సిగరెట్లను దుండగులు అమ్మివేసినట్లు తెలుస్తోంది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురం వద్ద రూ. 4కోట్లకు పైగా విలువ గల సిగరెట్ ప్యాకెట్ల లోడ్‌ను దుండగులు అపహరించిన విషయం విధితమే. సిగరెట్ ప్యాకెట్ సంచులను వేరుచేసి చేతులు మార్చినట్లు తెలుస్తోంది. దోపిడీకి ముందుగానే సరుకును కొనుగోలు చేసేలా కొందరు డీలర్లతో దుండగులు ఒప్పందం కుదుర్చుకున్నట్లు అనుమానిస్తున్నారు. దోచుకున్న తర్వాత సిగరెట్ ప్యాకెట్లను డీలర్లకు అప్పగించి ఉంటారని తెలుస్తోంది. ముఠాలో ఉన్న సభ్యులు వాటాల కింద వేసుకొని సిగరెట్లు పట్టుకుపోయి వారి సొంత గ్రామాలు, పట్టణాల్లో తక్కువ ధరకే విక్రయించి ఉంటారని భావిస్తున్నారు.

కాగా దోపిడీ ముఠాను పట్టుకునేందుకు రాచకొండ కమిషనరేట్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. దుండగులను పట్టుకోవడానికి వేటను ముమ్మరం చేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ముఠా సభ్యులే దోపిడికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. శనివారం రాత్రి(ఈనెల 19న) హైదరాబాద్‌లోని ముషీరాంబాద్ ఐటీసీ కంపెనీ నుంచి లోడ్ బయలుదేరగా అర్ధరాత్రి అంబర్‌పేట వద్ద రెండు సుమోల్లో 30 మంది గుర్తు తెలియని దుండగలు అడ్డగించి హైజాక్‌చేశారు. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గుట్టలో లారీని నిలిపివేసి సరుకును మరో కంటైనర్‌లారీలోకి ఎక్కించిన సంగతి తెలిసిందే. ఖైతాపురం వద్ద ఉన్న సీసీ ఫుటేజ్‌ల ప్రకారం కంటైనర్ లారీ అర్ధరాత్రి 1:35నిమి షాలకు నిలిచి ఉంది. అంతకు గంట ముందు మరో ప్రాంతంలో నిలిచి ఉన్నట్లు జీపీఎస్ సిస్టం ద్వారా తెలుస్తోంది. చౌటుప్పల్, హయత్‌నగర్, క్రైం బ్రాంచీ హైదరాబాద్ పోలీసులు ధర్యాప్తును ముమ్మరం చేస్తున్నారు. ఐటీసీ కంపెనీ సిబ్బందితో పాటు కంటైనర్ డ్రైవర్ అఖిలేష్ యాదవ్‌ను ప్రశ్నిస్తున్నారు మార్గమధ్యలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్‌లను సేకరించారు. సిటీలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమరాలను పరిశీలిస్తున్నారు. ఖైతాపురం వద్ద ఉన్న సీసీ ఫుటేజ్ దృశ్యాలు స్పష్టంగా కనిపించడం లేదు. ఎల్‌బీనగర్, హయత్ నగర్ ప్రాంతాల్లోనే ముఠా తిష్టవేసి ఫోన్ల ద్వారా సమాచారం అందిపుచ్చుకున్నట్లు అనుమానిస్తున్నారు. అనుమానిత ప్రాంతాల్లోని సెల్‌ఫోన్ కాల్ డేటాను జల్లెడపడుతు న్నారు. ఇదే తరహాల్లో దోపిడీ చేసిన చరిత్ర ఉన్న ముఠాల గురించి ఆరా తీస్తున్నారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, ప్రాంతాల్లో ఇలాంటి ముఠాలు ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. ఆయా రాష్ట్రాలకు ప్రత్యేక పోలీస్ బృందాలు బయలుదేరాయి. డ్రైవర్ అఖిలేష్‌ను ప్రత్యేకంగా విచారించి దుండగులు మాట్లాడిన యాస, భాష గురిచి తెలుసుకుంటున్నారు. పాత నేరస్థులను ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా దుండ గులను త్వరలోనే పట్టుకొని తీరుతా మని పోలీసులు చెబుతున్నారు. రాచకొండ పోలీసులు కేసును సవాల్‌గా తీసుకొని దర్యాప్తును ముమ్మరం చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

చౌటుప్పల్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. లింగోజిగూడెం గ్రామానికి చెందిన పర్నె విజయలక్ష్మి(32) భర్త, పిల్లలతో కలిసి బైక్ పై వస్తుండగా ధర్మాజిగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడింది. తీవ్రగాయాలైన విజయలక్ష్మిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి క్రైం: గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైద్రాబాద్ నుంచి బెల్లంపల్లి వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఉదయం 6.30గంటలకు భువనగిరి రైల్వే స్టేషన్ మీదుగా వెళ్తుంది. ఈసమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంటర్‌సిటీ రైలుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు బ్లూకలర్ షర్ట్, నలుపురంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉంటాడని తెలిపారు. మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే ఎస్ఐ సిహెచ్ ఎల్లయ్య తెలిపారు. పూర్తి సమాచారం కొరకు 9440700036 ఫోన్ నెంబర్‌కు సంప్రదించగలరని చెప్పారు.

వెంకటేశం మృతదేహం వెలికితీత


వెంకటేశం మృతదేహం

వలిగొండ: ఈత కోసం వచ్చి ప్రమాదవశాత్తు బావిలో మునిగి మృతి చెందిన విద్యార్థి మృతదేహాన్ని మంగళవారం వెలికితీశారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.... రంగారెడ్డి జిల్లా జిల్లాలగూడెం కమలానెహ్రూ కాలనీకి చెందిన అకారింగుల కృష్ణ కుమారుడు వెంకటేశం హైదరాబాద్‌లోని చంపాపేటలో వేద డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. కాగా ఆదివారం సెలవు కావడంతో అమ్మమ్మ గ్రామం చౌటుప్పల్ మండలం కుంట్లగూడెంకు వచ్చి ఆ మరుసటి రోజు సోమవారం గోకారం గ్రామ పరిధిలోని కుంట్లబావి వద్దకు ఈతకు వెళ్లి బావిలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. బావిలోని నీటిని మోటార్‌ల సహకారంతో పంపింగ్ చేయడం మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో మత్స్యకార్మికులు బావిలోపలికి వెళ్లి పాతాళ గడియతో గాలింపు చర్యలు చేపట్టాగా మృతదేహం మంగళవారం మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో నీటిపైకి తేలింది. మృతదేహాన్ని తాళ్లతో కట్టి బావిపైకి తీశారు. మృతుడి తండ్రి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులు మృతదేహాన్ని స్వస్థలానికి తరలించారు.

ఆ 24 గంటలు

మృతుడు వెంకటేశం సోమవారం మధ్యాహ్నం 12గంటలకు బావిలో మునిగిపోయాడు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు మృతదేహం కోసం బావి వద్ద నిరీక్షించ సాగారు. మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు మృతదేహం నీటిపైకి తేలడంతో సుమారుగా 24గంటలుగా ఆగిన ఉత్కంఠతకు తెరపడింది. బావి అడుగు భాగాన ఒంద్రు మట్టి, ఎండిన ముళ్లపొదలు ఉండడంతో వెంకటేశం దేహం దానిలో చిక్కుకుంది. నీటి మట్టం కొంత ఉండగానే మృతదేహం బయటపడింది.

వెంకటేశం మునిగిపోయిన కుంట్లబావి సుమారుగా 30,40ఫీట్‌ల లోతు ఉంది. నిండుకుండలా బావిలో నీరు ఉంది. ఆ నీటిని తీయడానికి దివీస్ సంస్థ అందించిన 15హెచ్‌పీ మోటార్‌తో, మరో రెండు 5హెచ్‌పీ మోటర్‌లతో సోమవారం రాత్రి 11గంటల నుంచి మంగళవారం మధ్యాహ్నం 12గంటల వరకు నిరంతరంగా మోటార్‌లతో నీటిని పంపింగ్‌చేయడంతో సుమారు 13గంటల అనంతరం మృతదేహం బయటకు తీయగలిగారు.

కుటుంబంలో విషాద ఛాయలు

ఎదిగొచ్చిన కొడుకు మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఒక సంవత్సరంలో చదువు పూర్తయి ఉద్యోగం సంపాధించుకొని వివాహం చేసుకుని ఆనందంగా ఉందామనుకున్న తరుణంలో మృత్యువు బావి రూపంలో కభళించిందని, కుటుంబానికి పెద్ద దిక్కు అవుతాడనుకున్న కుమారుడి మృతిడి తల్లిదండ్రులు జీర్ణించుకోలేక పోతున్నారు. వెంకటేశం చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ తల్లి భాగ్యమ్మ దుఃఖిస్తుంటే పలువురు కంటతడి పెట్టారు. అమ్మమ్మ ఇంట్లో పండుగ కాగా వెంకటేశం మృతితో ఆనందం కరువైంది. పండు ముసలి అమ్మమ్మ బావి చుట్టూ తిరిగి రోధిస్తుంటే ఆమె దుఃఖాన్ని ఆపడం ఎవరి తరం కాలేదు.

అహర్నిశలు శ్రమించిన పోలీసులు...

వెంకటేశం మృతదేహాన్ని బయటకు తీయుటకు స్థానిక ఎస్ఐ డి. వెంకటేశ్వర్లు అహర్నిషలు కృషి చేశారు. రాత్రి, పగలు బావి వద్ద సహాయక చర్యలలో తనదైన పాత్ర పోషించాడు. రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థుల సహకారంతో ఒక వైపు సహాయక చర్యలు చేపడుతూనే మరో వైపు రోధిస్తున్న మృతుని కుటుంబానికి మనో ధైర్యాన్నినింపాడు. విధి నిర్వహణలో ఎస్ఐ చేసిన కృషిని పలువురు ప్రశంసించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుర్కపల్లి సురేందర్, సర్పంచ్ సిర్పంగి నిర్మల శ్రీరాములు, సీపీఎం మండల కార్యదర్శి రాజయ్యలు పూర్తి సహకారం అందించారు.



సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న ఎస్ఐ, బావి చుట్టూ గుమ్మిగూడిన బంధువులు

పత్తిచేల పరిశీలన

అడ్డగూడూరు: మండలంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామంలో పత్తి సాగును ఏవో అరుణకుమారి మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పదును ఎక్కువై వేరుకుళ్లు సోకి పంటలు దెబ్బతింటున్నాయన్నారు.

15 రోజుల వ్యవధిలో కాపర్ ఆక్సిక్లోరైడ్ రెండుసార్లు పికారి చేయాలని, కొంత పొడిని బకెట్లో కలిపి చనిపోయిన పత్తి మొక్కల మొదళ్లలో పోయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పొన్నాల చంద్రకళవెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బొమ్మగాని అంజమ్మ, ఏఈవో దయాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మోత్కూరు: జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని టీయూడబ్ల్యూజే-హెచ్(143) జిల్లా అధ్యక్షుడు గొట్టిపర్తి భాస్కర్ అన్నారు. మంగళవారం మోత్కూరు ఎస్ఎం ఫంక్షన్ హాల్‌లో జరిగిన మోత్కూరు, అడ్డగూడూరు మండలాల జర్నలిస్టుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మండల కమిటీ గౌరవాధ్యక్షుడిగా గుంటి అవిలయ్య, అధ్యక్షుడిగా కె.ప్రశాంత్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వమే నిర్వహించాలి

మోత్కూరు: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సెప్టెంబర్ 17న రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని కోరుతూ బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ జి.దశరథకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కొణతం నాగార్జునరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు చింతల నర్సిరెడ్డి, పాండు, వి.సంజీవరెడ్డి, అండెం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

టంగుటూరులో హరితహారం

ఆలేరు: మండలంలోని టంగుటూరు గ్రామంలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని కుంట కట్టలపై 800 ఈత మొక్కలు నాటారు. సంఘం అధ్యక్షుడు దూసరి పాండు మాట్లాడుతూ ఈత వనాల పెంపుతో గౌడ కులస్థులకు జీవనోపాధి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో దూడల సిద్ధులు, ఉప్పలయ్య, రమేశ్, సత్తయ్య, లింగం, వడ్డెపల్లి రేణుక పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న దృశ్యం

ప్రతి విద్యార్థికి ఎంఆర్ టీకా వేయించాలి

● 9నెలలనుంచి 15ఏళ్లలోపు పిల్లలకు తప్పనిసరి

ఆత్మకూరు(ఎం): ప్రతి విద్యార్థి ఎంఆర్ టీకా వేయించుకోవాలని ఎంపీపీ కె.భాగ్యశ్రీ కోరారు. మంగళవారం మండలంలోని ఖప్రాయపల్లి, కూరెళ్ల పాఠశాలల్లో విద్యార్థులకు ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఆర్ టీకా వేయించుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.మల్లమ్మ, వైద్యాధికారి లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మోటకొండూర్: ఎంఆర్ వాక్సిన్లను 9నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ ఇప్పించాలని డాక్టర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని చాడ, ముత్తిరెడ్డిగూడేనికి చెందిన విద్యార్థులకు ఎంఆర్ వాక్సిన్లు వేసి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఈవో ప్రవీణ్‌కుమార్, సూపర్‌వైజర్ కృష్ణారెడ్డి, ధనమ్మ, దేవావర, అంగన్‌వాడీ టీచర్లు రాధిక, అనురాధ పాల్గొన్నారు.


ఆలేరులో టీకా వేస్తున్న సిబ్బంది

ఆలేరు: పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం శారాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మిజిల్స్, రూబెల్లా టీకాలు వేశారు. పట్టణంలోని శ్రీరామకృష్ణ విద్యాలయం ఎవరెస్టు హైస్కూల్, విశ్వభారతి పాఠశాలలకు చెందిన 1,135మంది విద్యార్థులకు ఈటీకాలు వేసినట్లు వైద్యాధికారి జ్యోతిబాయి చెప్పారు. అలాగే ఏకశిల హైస్కూల్‌లోని 1000 మంది విద్యార్థులకు సోమవారం ఈటీకా వేయించామన్నారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు బండి రాజుల శంకర్, మిట్టపల్లి విజయ్‌కుమార్, అనిత, సి.ఉపేందర్‌రెడ్డి, ఇందిర, రెహమాన్, హెల్త్ సూపరింటెండెంట్లు యాకయ్య, నర్సింహారెడ్డి, హెచ్ఈవో శ్రావణ్‌కుమార్, ఏఎన్ఎం, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యంపై అవగాహన

ఆలేరు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులు, బాలింతలకు తల్లిపాలు ప్రాముఖ్యంపై కేంద్రాల కార్యకర్తలు పూర్తి అవగాహన కల్పించాలని డీడబ్ల్యూవో పీడీ జి.శారద కోరారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలేరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో చంద్రకళ, సూపర్‌వైజర్లు నర్మద, అనిత, అంజమ్మ, పద్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శారద

నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఆత్మకూరు(ఎం): మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల25నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్ఐ డి.అనిల్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో అఖిలపక్షం, ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఏగ్రామంలో గణేష్ మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నా ముందుగా పోలీస్, విద్యుత్‌శాఖనుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జూలూరు నర్సింహ, ఆత్మకూరు, సర్వేపల్లి ఎంపీటీసీలు డి.నర్సింహాచారి, పి.హేమలత, కాంగ్రెస్, టీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ మండలబాధ్యులు కె.నరేందర్, బి.ఉప్పలయ్య, బి.సత్యనారాయణ, యు.ముత్యాలు, కె.అనంతరెడ్డి, కాంగ్రెస్, బీజేపీ జిల్లా కార్యదర్శులు వై.లక్ష్మారెడ్డి, బి.ఇంద్రారెడ్డి, పి.అబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ

‘సమ్మె కాలాన్ని సెలవు దినాలుగా ప్రకటించాలి’

యాదాద్రి రూరల్: ప్రత్యేక రాష్ట్రంకోసం సకలజనుల సమ్మెలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులకు సమ్మె కాలానికి సెలవుదినాలుగా వర్తింపజేయాలని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు బొలగాని సత్యనారాయణ, ఎంప్లాయీస్ యూనియన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు పసల రుబెన్, నల్లమాస జగదీశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డిపో ఆవరణలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఒకరోజు సామూహిక నిరాహర దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో రమేశ్‌గౌడ్, క్రాంతి కుమార్, యుగంధర్, అశోక్, మల్లయ్య, రంగ శ్రీనివాస్‌గౌడ్, బాబార్‌పాషా పాల్గొన్నారు.

సిద్ధయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

యాదాద్రి రూరల్: మండలంలోని ధర్మారెడ్డిగూడేనికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఐ సీనియర్‌నేత గోపాల సిద్ధయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ జిల్లాకార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. మంగళవారం సిద్ధయ్య మృతదేహంపై ఎర్రని జెండాలు, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కొల్లూరి రాజయ్య, టంటం రాములమ్మ, ఆరె నర్సింహులు, కిష్టయ్య, స్వామి పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

యాదాద్రి రూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు బొలగాని సత్యనారాయణ, మండల కార్యదర్శి బబ్బూరి శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మండల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బండి జంగమ్మ, బండపెల్లి నర్సయ్య, కోకల రవీందర్, జంగయ్య, బంగారి, మల్లేశ్, పల్లం నర్సింహ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

సామూహిక సెలవు పోస్టర్ ఆవిష్కరణ

యాదాద్రి రూరల్: సీపీఎస్ విధానం రద్దుకోసం వచ్చేనెల 1న ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు చేపట్టిన సామూహిక సెలవు పోస్టర్‌ను మంగళవారం గుట్టలో ఆవిష్కరించారు. ఈ సామూహిక సెలవుకు పీఆర్‌టీయూ టీఎస్ మద్దతు తెలిపింది. కార్యక్రమంలో ఎంఈవో వనం రాజారాములు, అమృతంరెడ్డి, లింగస్వామి, సంతోష్‌కుమార్, లక్ష్మీనరసింహస్వామి, ఉదయ్‌కుమార్, వీరేశం, జగదీశ్ పాల్గొన్నారు.

మరుగుదొడ్లను పరిశీలించిన ఎంపీడీవో

రాజాపేట: రాజాపేట మండలం బూరుగుపల్లి గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాన్ని మంగళవారం ఎంపీడీవో రేవతమ్మ పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, సెక్రటరీ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య వారోత్సవాలు

రాజాపేట మండలంలో పారిశుధ్య వారోత్సవాలు కొనసాగుతున్నాయి. మండలకేంద్రంలో వీధుల్లోని చెత్తచెదారాన్ని తొలగించారు. కంప చెట్లును నరికి వేశారు.

కేసీఆర్ కిట్ల పంపిణీ

మోటకొండూర్: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ప్రసవించిన బాలింతలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కేసీఆర్ కిట్లను డాక్టర్ శ్రావణ్ కుమార్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేయడానికి తామెప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు.


కేసీఆర్ కిట్లను అందజేస్తున్న దృశ్యం

గ్యాస్ సమాచారం

తుర్కపల్లి

తుర్కపల్లి వైష్ణవి ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్‌లో గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు వెంటనే గ్యాస్ సరఫరా చేస్తారు. కొత్తగా గ్యాస్‌కనెక్షన్లకు సెల్ నంబర్లు: 9912305419, 9550195232

కూరగాయల ధరలు

కిలో ధర

దోసకాయ16, సొరకాయ10, టమాట50, చిక్కుడు40, క్యాప్సికం40, మిర్చి(సన్న)30, మిర్చి(దొడ్డు)40, క్యారెట్54, క్యాబేజీ16, బెండ24, దొండ16, చామగడ్డ32, బీర30, కాకర30, ఆలుగడ్డ18, వంకాయ36, బీట్‌రూట్32, గోకర32, బీన్స్56, ఉల్లిగడ్డలు తెల్లవి-32, ఎర్రవి-28.

(ఆలేరు)

సినిమాలు

యాదగిరిగుట్ట
లక్ష్మి - నక్షత్రం

టీమాస్ ఫోరం ఆవిర్భావ సభ
పోస్టర్ ఆవిష్కరణ

తుర్కపల్లి: మండలకేంద్రంలోని జేఎం ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం తెలంగాణ సామాజిక, ప్రజా సంఘాల ఐక్య వేదిక టీమాస్ ఫోరం ఆవిర్భావ సభ వాల్‌పోస్టర్లను ఐక్య వేదిక నాయకులు ఆవిష్కరించారు. ఈనెల29న జిల్లా కేంద్రంలోని ఏఆర్ గార్డెన్స్‌లో జరిగే టీమాస్ ఫోరం ఆవిర్భావ సభకు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుగులోతు దూప్‌సింగ్ నాయక్, కల్లూరి మల్లేశం, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, సిలివేరు దుర్గయ్య, జె నరేందర్, రమేశ్ పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం ఉద్యమించాలి

● మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ విశ్వేశ్వర్ రావు

భువనగిరి టౌన్: రాష్ట్రంలో సామాజిక న్యాయం కోసం మేధావులు ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ విశ్వేశ్వర్ రావు అన్నారు. మంగళవారం భువనగిరిలో జరిగిన ఫోరం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం కొలువుదీరి మూడేండ్లు గడిచినా సామాజిక న్యాయం జాడే లేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ వాగ్ధానాలు, ప్రకటనలకే పరిమితమయ్యారన్నారు. పాఠశాలలనుంచి విద్యార్థుల డ్రాపౌట్ శాతం పెరుగుతుండటం విద్యా వ్యవస్థ ప్రమాద స్థితిని హెచ్చరిస్తుందన్నారు. సమావేశంలో ఫోరం కో కన్వీనర్ హిమబిందు, టీమాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య, జిల్లా నాయకులు ఎండి జహంగీర్, కొండమడుగు నర్సింహ, బాలరాజు, మల్లేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వర్ రావు


వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సమస్యలు పరిష్కరించాలి

భువనగిరి రూరల్: గ్రామాభివృద్ధిలో ప్రధాన భూమిక పోషిస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా అధ్యక్షుడు కాసోజు నాగరాజు అన్నారు. మంగళవారం ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డిలను కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ కేవీ జిల్లా కన్వీనర్ మందుల వెంకటయ్య, నాయకులు ఎం.వెంకటేశం, మల్లేశం, భాస్కర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

● తరుచూ ప్రమాదాలో ● పట్టించుకోని పాలకులు

ఈ రహదారి యమ.. డేంజర్


బీబీనగర్ బైపాసు రోడ్డులో అండర్‌పాసింగ్ లేక అడ్డదిట్టంగా రోడ్డు దాటుతున్న కారు

బీబీనగర్: జిల్లా పరిధిలోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై రోజుకు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నాలుగు లైన్ల విస్తరణ తర్వాత ప్రమాదాలు తగ్గుముఖం పడుతుంటాయని అంతా భావించినా అక్కడక్కడ ప్రమాద కూడళ్లలో అండర్ పాస్, పుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు నోచుకోకపోవడంతో ప్రమాదాలు మరింత పెరుగుతూ వస్తున్నాయి. ఏటా అనేక మంది మృత్యువాతపడుతున్నారు. జిల్లా పరిధిలోని బీబీనగర్ బైపాసు రోడ్డు, కొండమడుగు మెట్టు సర్కిల్, నిమ్స్ సర్కిల్ వద్ద రోడ్డు దాటుతూ వాహనాదారులు యూ టర్న్ చేసుకుంటున్న సందర్భాల్లో జరిగిన ప్రమాదాల్లో గడిచిన ఏడాదిలో 30 మందికి పైగా చనిపోగా చాలా మంది కాళ్ళు, చేతులు పోగొట్టుకొని వికలాంగులుగా మారారంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. నియోజకవర్గంలోని బీబీనగర్, భువనగిరి మార్గంలోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ప్రయాణం అంటేనే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి నెలకొన్నది. బీబీనగర్ మండల పరిధిలోని కొండమడుగు మెట్టు సర్కిల్, నిమ్స్ సర్కిల్, మండలకేంద్రంలోని బైపాసు రోడ్డు, బ్యాంకు సర్కిల్ నిత్యం రద్దీగా ఉండే ప్రదేశాలు. ఇక్కడ ప్రజలకు అనువుగా అండర్‌పాసింగ్ కాని పుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలులేవు. దీని కారణంగా సుమారు 50 గ్రామాల ప్రజలు బీబీనగర్ బైపాసు రోడ్డు మీదుగా అనేక ప్రాంతాలకు విద్యా, ఉద్యోగ, వ్యాపార నిమిత్తం నిత్యం ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. అయితే ఇటు హైదరాబాద్‌కు అటు భువనగిరి వైపు వెళ్లాలన్న రోడ్డును దాటి బస్సులు, ఆటోలు, ఇతరత్ర వాహనాల్లో ప్రయాణాలు చేస్తుంటారు. రెండు వైపులనుంచి వేగంగా దూసుకొచ్చే వాహనాలను కనిపెడుతూ రోడ్డును దాటాల్సి ఉంటుంది. తొందరగా వెళ్లాలన్న ఆతృతతో రోడ్డును దాటే క్రమంలో అనేకమంది ప్రమాదాల బారిన పడుతూ ప్రాణాలు పోగొట్టుకుంటుండగా అనేక మంది గాయాలపాలవుతున్నారు. కొండమడుగు మెట్టు వద్ద హైవే పక్కనే మద్యం షాపులు, దాబాలు, హోటళ్లు ఎక్కువగా ఉండటంతో వాహనాదారులు రోడ్డు పక్కనే వాహనాలు నిలిపేస్తుండటంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. నిమ్స్ సర్కిల్ వద్ద వాహనాదారులు యూ టర్న్ తీసుకునే సమయాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. గడిచిన నెలరోజుల్లోనే ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు ప్రాణాలు పోగొట్టుకోగా 10మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత ఎమ్మెల్యే, ఎంపీలు చొరవ తీసుకుని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొండమడుగు మెట్టు సర్కిల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)


ప్రమాదాల నివారణకు చర్యలు



ఉన్నతాధికారుల ఆదేశాలు, సూచనలమేరకు మండల పరిధిలోని జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు హైవేపై పెట్రోలింగ్, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నాం. ప్రమాద హెచ్చరిక సూచికలు ఏర్పాటుచేసి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటాం.

సురేశ్ కుమార్, ఎస్ఐ

పర్వతారోహకులకు సన్మానం


పర్వతారోహలను సన్మానిస్తున్న దృశ్యం

భువనగిరి టౌన్: భువనగిరి ఖిల్లాపై ప్రాథమిక శిక్షణ పొంది ఎలబర్స్, కిలిమంజారో పర్వతాలు అధిరోహించిన విద్యార్థులను సోమవారం భువనగిరిలో ఇన్నర్ వీల్ క్లబ్, వారసత్వ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రష్యాలోని ఎలబర్స్ పర్వతాన్ని అధిరోహించిన ఆలేరు సాంఘీక సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శ్రీవిద్య, ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన స్థానిక ఎస్ఎల్ఎన్ఎస్ కళాశాల విద్యార్థులు శ్రీకుమార్ నాయక్, అరుణ్ నాయక్, శిక్షణ ఇచ్చిన భువనగిరి రాక్ క్లైంబింగ్ స్కూల్ ప్రిన్సిపల్ డి.శేఖర్ బాబును సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ జయశ్రీ, జంపాల అంజయ్య, దిడ్డి బాలాజీ, ఆవుల వినోద్, బండారు జయశ్రీ, డాక్టర్ అనసూయ, లావణ్య, సోమేశ్వర్, నిర్మల, భారతి, తిరుమల, మంజుల, హైమావతి, హర్షిణి, ప్రిన్సిపల్ శ్రీధర్ పాల్గొన్నారు.

షోయాబుల్లా ఖాన్‌కు ఘననివాళి


నివాళి అర్పిస్తున్న నాయకులు

భువనగిరి టౌన్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీనియర్ జర్నలిస్టు షోయాబుల్లా ఖాన్ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం భువనగిరిలో ఘన నివాళులర్పించారు. బీజేపీ మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతిలో మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎండి.మహమూద్ మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల నర్సింగ్ రావు, కార్యదర్శి నీలం రమేశ్, పి.బలరాం, ఉదయగిరి విజయ్, రత్నపురం బలరాం, మంగు నర్సింహారావు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ కమిటీ ఎన్నిక


విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీ

భువనగిరి టౌన్: విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం భువనగిరి పట్టణ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జనగాం నర్సింహాచారి, ఉపాధ్యక్షులుగా దాసోజు విశ్వరూపాచారి, దేవరకొండ గణేశ్ చారి, ప్రధాన కార్యదర్శి మామి డోజు లక్ష్మీనారాయణ, కోశాధికారిగా కేమోజు మల్లికార్జునాచారి, సహాయ కార్య దర్శిగా ఐటికాల దేవేంద్రచారి, కార్యదర్శిగా కొండోజు వెంకటాచారితోపాటు మరో తొమ్మిది మంది కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా కన్వీనర్‌గా వడ్లకొండ ఉపేంద్రచారి, మండల అధ్యక్షుడు కొల్లోజు వెంకటాచారి, నాయకులు కొల్లోజు సతీష్, పాములపర్తి నవీంద్రచారి, కట్కూరి ప్రతాప్, రామచంద్రాపురం సర్పంచ్ శైలజ పాల్గొన్నారు.

'సుపరిపాలన దిశగా ప్రపంచ దేశాలు'

భువనగిరి టౌన్: ప్రపంచ దేశాలు సుపరిపాలనవైపు పయనిస్తున్నాయని, ఈ దిశలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఉన్నాయని ప్రొఫెసర్ డాక్టర్ సురేందర్ అన్నారు. మంగళవారం భువనగిరి ఎస్ఎల్ఎన్ఎస్ కళాశాలలో సుపరిపాలన అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన విస్తరణోపన్యాసం చేశారు. సుపరిపాలన ఫలితాలు 2030నాటికి ప్రపంచ వ్యాప్తంగా అందరికీ అందుతాయన్నారు. విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. సమావేశంలో మునిసిపల్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రావు, లెక్చరర్లు స్నేహలత, రమేశ్, పి.బాల్‌రెడ్డి, కె.కిష్టయ్య, డాక్టర్ జంగయ్య, బాలరాజు, సుధ, ఎస్.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే

ప్రతిష్ఠించాలి

భువనగిరి టౌన్: పర్యావరణ పరిరక్షణకు గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని యువ టీం కన్వీనర్ సూదగాని రాజు అన్నారు. మట్టి విగ్రహాలపై యువ టీం ఆధ్వర్యంలో మంగళవారం భువనగిరిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో యువటీం కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్యాస్ సమాచారం

సరఫరా తేదీ : 23-8-2017

గ్యాస్ కంపెనీ బుకింగ్ తేదీ

ఇండేన్ ఆగస్టు16 బుక్ చేసుకున్న వారికి సరఫరా.. ఆన్‌లైన్ బుకింగ్ 9848824365, 08685-245553.

కూరగాయల ధరలు

దోసకాయ కిలోకు 16, సొరకాయ14, టమాట44, చిక్కుడు36, క్యాప్సికం34, గోకరకాయ22, మిర్చి (లావు)28, మిర్చి (సన్న)28, క్యారెట్40, క్యాబేజీ15, బీన్స్34, బెండకాయ20, దొండకాయ22, పొట్లకాయ16, చామగడ్డ28, కాకరకాయ20, బీరకాయ20, ఆలుగడ్డ16, ఉల్లిగడ్డ35, కీర18, ఉల్లిపొరక14, వంకాయ18.

(భువనగిరి రూరల్)

సినిమాలు

భువనగిరి
ఓంకార్- నక్షత్రం
వసుంధర- ఫిదా
భద్రాద్రి - దర్శకుడు
కేజేఆర్- గౌతమ్‌నంద

నిత్యావసర వస్తువుల విక్రయాలను

పునరుద్ధరించాలి

భువనగిరి టౌన్: వినాయక చవితి, బక్రీద్ పండుగలను పురస్కరించుకుని చౌకధరల దుకాణాల్లో నిత్యావసర వస్తువుల విక్రయాలను పునరుద్ధరించాలని జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు ఎండీ షరీఫ్ మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నామమాత్రపు ధరలతో లభించే నిత్యావసర వస్తువుల విక్రయాలను నిలిపివేయడంతో సామాన్యులు ఇబ్బందులకు గురవుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు.

'వికలాంగ సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు'

భువనగిరి టౌన్: బడ్జెట్‌లో నామమాత్రపు నిధులు కేటాయిస్తూ వికలాంగుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుర్వంగ ప్రకాశ్, వనం ఉపేందర్ అన్నారు. మంగళవారం భువనగిరిలో జరిగిన వేదిక సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 27,28 తేదీల్లో సంగారెడ్డిలో జరిగే వేదిక రాష్ట్ర మహాసభల్లో వికలాంగులంతా పాల్గొనాలన్నారు. సమావేశంలో మామిడి కృష్ణ, ఉదయ్‌గిరి శ్రీనివాస్, మంగమ్మ, సరిత, పద్మ, నర్సింహ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

చిరుజల్లులే..


వర్షాల్లేక వెలవెలబోతున్న మోత్కూరు మండలం పాటిమట్ల చెరువు

● కురువని భారీ వర్షాలు
● నిండని చెరువులు, కుంటలు
● పెరగని భూగర్భజలాలు
● ఇలా ఉంటే గడ్డుకాలమేనంటున్న రైతులు
● మెట్ట పంటల సాగు ఆశాజనకం

(మోత్కూరు)

జిల్లాలో వరుణ దేవుడు చిరుజల్లులతోనే సరిపుచ్చుతున్నాడు. భారీ వర్షాలు కురుస్తాయని ఆశించి ఖరీఫ్ వరిసాగు కోసం సిద్ధం చేసుకున్న నార్లు ఇంకా పలుచోట్ల అలానే ఉన్నాయి. ఆరుద్ర కార్తెలో పోసిన నార్లు కూడా ముదిరిపోతున్నాయి. జిల్లాలో నేటికీ భారీ వర్షాలు కురవకపోవడంతో ఒకట్రెండు తప్పా చెరువులు, కుంటలు నిండలేదు. దీంతో బావులు, బోర్లలో భూగర్భజలాలు పెరగక వరి సాగు పూర్తిస్థాయిలో జరగలేదు. ఈసారి మెట్ట పంటలు కొంత ఆశాజనకంగా ఉన్నప్పటికీ పరిస్థితి ఇలానే ఉంటే వచ్చే రబీ సీజన్‌లో వరిసాగు దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతుల ఆశలు అడియాశలేనా..?

ఈ సంవత్సరం ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు కురవడంతో ఈ ఏడాది కలిసి వస్తుందని రైతులు ఎంతో ఆనందపడ్డారు. సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని ఆశించిన రైతుకు నేటికీ భారీ వర్షాలు కురవకపోవడంతో నిరాశే మిగిలింది. ఖరీఫ్ సగం కాలం గడిచినా భారీ వర్షాలు కురవకపోవడంతో చెరువులు, కుంటలు నిండక భూగర్భజలాలు పెరగక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆరుద్ర కార్తెలో పోసిన నార్లు కూడా ముదిరిపోతుండటంతో చేసేదేమి లేక రైతులు నిట్టూర్చుతున్నారు. కాగా అడపాదడపా కురుస్తున్న ముసుర్లకు మెట్ట పంటల సాగు మాత్రం కొంత ఆశాజనకంగానే ఉంది. పత్తి, కంది తదితర మెట్ట పంటలు పచ్చగా నిగనిగలాడుతున్నాయి.

ఇలా ఉంటే యాసంగి వరిసాగు ప్రశ్నార్థకమే..

జిల్లాలో రైతులు ఖరీఫ్‌లో వరి, పత్తి విస్తారంగా సాగు చేస్తారు. యాసంగి సీజన్‌కు వచ్చే సరికి కేవలం వరి మాత్రమే సాగు చేస్తారు. వర్షాకాలం సగం గడిచిపోయినా భారీ వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో బావులు, బోర్లు, బిక్కేరు వాగులోని చేతిబోర్లపై ఆధారపడే వరి సాగవుతుంది. భారీ వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండితేనే బావులు, బోర్లలో భూగర్భజలాలు పెరుగుతాయి. ఆగస్టు మాసం గడిచిపోతున్నా భారీ వర్షాలు కురవకపోవడం, చెరువులు, కుంటలు నిండకపోవడంతో యాసంగి సీజన్ నాటికి బావులు, బోర్లు పూర్తిగా ఒట్టిపోతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో వెయ్యికి పైగా...

జిల్లాలో వెయ్యికిపైగా చెరువులు, కుంటలు ఉన్నాయి. వర్షాలు లేక ఒకట్రెండు తప్ప మిగతా చెరువులు, కుంటలు నిండలేదు. బిక్కేరు వాగులోనూ కొంత దూరం మాత్రమే నీరు వచ్చింది. ఆ నీటిని కూడా ఖరీఫ్ సీజన్‌లో బోర్లు తోడేస్తున్నాయి. జిల్లాలో సాధారణ వరిసాగు విస్తీర్ణం 28,730 హెక్టార్లు కాగా ఇప్పటికి 26,509 హెక్టార్లు సాగు చేశారు.

ఈసారి కాలం అయ్యేలా లేదు



జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు బాగా తగ్గిపోయాయి. ఇప్పటివరకు ముసుర్లే తప్ప భారీ వర్షాలు కురవడంలేదు. ముసుర్లకు పత్తి, కంది లాంటి మెట్ట పంటలు బాగానే ఉన్నప్పటికీ వరిసాగు కష్టమవుతున్నది.

అశోక్‌రెడ్డి, రైతు, మోత్కూరు

చెరువులు, కుంటలు నిండలేదు



వర్షాకాలం సగానికి పైగా గడిచిపోయినా నేటికీ మోత్కూరు మండలంలో భారీ వర్షాలు కురవలేదు. ఇతర కొన్ని మండలాల్లోని పలు చెరువులు, కుంటల్లోకి 20 నుంచి 50శాతం నీరు వచ్చినప్పటికీ చెరువులు, కుంటల్లోకి నీరు రాలేదు.

డి.రమేష్, రైతు, జామచెట్లబావి

పూర్వ వైభవం తేవాలి

భువనగిరి టౌన్: జిల్లాలో హాకీ క్రీడకు పూర్వ వైభవం తేవాలని సివిల్ సప్లై జిల్లా మేనేజర్ ఎ.సత్యం అన్నారు. మంగళవారం జిల్లా హాకీ అసోసియేషన్‌కు ఆయన క్రీడా సామగ్రిని అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఓవైసీ ఖాద్రీ, జె.కొండల్‌రెడ్డి, ఎండీ జావిద్ ఖాద్రీ, చందుపట్ల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.


క్రీడా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

హరిత హారం లక్ష్యాలను అధిగమించాలి

● అటవీశాఖ ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

యాదాద్రి, ఆంధ్రజ్యోతి: పచ్చదనం, అటవీ విస్తీర్ణం పెంపొందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తెలంగాణకు హరిత హారం కార్యక్రమంలో నిర్ధేశిత లక్ష్యాలను అధిగమించాలని రాష్ట్ర అటవీశాఖ ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలవారీగా హరితహారం ప్రగతిని సమీక్షించారు. కార్య క్రమంలో రాష్ట్ర అటవీశాఖ ముఖ్య కన్జర్వేటర్ పీకే ఝా, అదనపు ప్రిన్సిపల్ కన్జర్వేటర్ గోబ్రి యాల్ డీఆర్‌వో మహేందర్‌రెడ్డి, డీఆర్‌డీవో ఎస్.వెంకట్రావ్, జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ హాల్ ప్రారంభం

కలెక్టరేట్‌లో మంగళవారం కొత్తగా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ హాల్‌ను జిల్లా రెవెన్యూ అధికారి మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ లేకపోవడంతో కలెక్టర్‌తోపాటు ఇతర జిల్లా అధికారులు బీబీనగర్ తహసీల్దార్ కార్యాలయంలోని హాల్‌కు వెళ్లేవారు. అయితే కలెక్టరేట్‌లోనే వీడియో కాన్ఫరెన్స్‌కోసం ప్రత్యేక హాల్, సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేశారు.

తక్కువ వ్యయంతో ప్రాజెక్టులు రూపొందించాలి


మాట్లాడుతున్న భిక్షమయ్యగౌడ్

భువనగిరి రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లాకు సాగు నీరందించేందుకు చేపడుతున్న గంధమల్ల, బస్వాపురం ప్రాజెక్టులను ప్రజాభీష్టం మేరకు తక్కువ వ్యయంతో డిజైన్లు రూపొందించి సేకరించిన భూములకు 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని డీసీసీ బూడిద భిక్షమయ్య గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మంగళవారం భువనగిరి రహదారిబంగ్లాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రాజెక్టుల డిజైన్ రూపొందించినట్లు తెలిపారు. 11.39టీఎంసీల సామర్థ్యంతో బస్వాపురం, 9.8టీఎంసీల సామర్థ్యంతో గంధమల్ల రిజర్వాయర్లకు డిజైన్లు రూపొదించడంతో రైతులు భూములు కోల్పోయి నిరాశ్రయులవడంతోపాటు తొమ్మిది గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోత్నక్ ప్రమోద్‌కుమార్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎడమ బాలకృష్ణ, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు బీసుకుంట్ల సత్యనారాయణ, కోట పెద్దస్వామి, నాయకులు చిక్కుల వెంకటేశ్, వడిచర్ల కృష్ణయాదవ్, అబేద్ అలీ, బబ్లు, రావుల నందు, కొల్లూరి రాజు, తాడూరి నర్సింహ, తాడూరి బాలరాజు, సిరికొండ శివకుమార్, ఎడమ పవన్ ఉన్నారు.

అధికార పార్టీ నాయకుల సమావేశమా...?

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు

మండలంలోని రాయగిరి గ్రామంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం చేపట్టిన నిర్వాసితుల ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం టీఆర్ఎస్ పార్టీ నాయకుల, కార్యకర్తల సమావేశంగా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు ఆరోపించారు. మంగళవారం భువనగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపూర్, బస్వాపూర్, రాళ్ళజనగాం, లప్పానాయక్ తండా, గ్రామాల రైతులు, నిర్వాసితులను ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టే హాల్‌లోకి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని, లేకపోతే ప్రజా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల నర్సింగ్‌రావు పార్టీ మండల అధ్యక్షుడు మట్ట అంజనేయులుగౌడ్, నాయకులు పడమటి జగన్మోహన్‌రెడ్డి, పంచెద్దుల బలరాం, రమేశ్, ఉపేందర్ పాల్గొన్నారు.

మినీ లోకం



సమాచారం

ఐటీఐలో 2వ విడత ప్రవేశాలకు 28 తుది గడువు

భువనగిరి టౌన్: ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు 28లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని భువనగిరి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ విజయలక్ష్మీ తెలిపారు. సీట్ల కేటాయింపులో రిజర్వేషన్ అమలు చేస్తామని తెలిపారు. మొదటి విడతలో భర్తీ కాని సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

పోలీసు శాఖలో పరస్పర బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

● సెప్టెంబర్ 8 వరకు గడువు

నల్లగొండ క్రైం: పోలీసు శాఖలో పని చేస్తున్న సిబ్బంది పరస్పర(మ్యూచువల్), స్పౌజ్ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జిల్లాల విభజన జరిగి సుమారు ఏడాది కావస్తున్నా పోలీసు శాఖలో పని చేస్తున్న సిబ్బంది విభజన జరగలేదు. ఉమ్మడి జిల్లాలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గత ఆరు నెలల క్రితం కొంతమంది సిబ్బందిని ఆయా జిల్లాలకు బదిలీ చేసిన అర్హత ప్రకారమే జిల్లా పోలీసు శాఖచేసింది. నూతన జిల్లాలకు సంబంధించిన సిబ్బంది నాటినుంచి వేర్వేరు జిల్లాల్లో పని చేస్తుండటంతో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆరు నెలల క్రితం మ్యూచువల్‌కు దరఖాస్తు చేసుకున్నా పోలీసు అధికారులు పరిష్కారం చూపక పోవటంతో నాటి నుంచి దరఖాస్తు చేసుకున్న సిబ్బంది ఎదురు చూస్తున్నారు. తాజాగా ప్రభుత్వం పరస్పర బదిలీలకు అవకాశం కల్పించటంతో సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబర్ 8వ తేదీ వరకు బదిలీల ప్రక్రియ పూర్తి కావాలని అందుకోసం సిబ్బంది ఆయా కమిషనరేట్లు, ఎస్పీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో సుమారు 2 వేల మంది సిబ్బంది వరకు లబ్ధి పొందే అవకాశాలున్నాయి.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె

యాదాద్రి, ఆంధ్రజ్యోతి: బ్యాంకింగ్ రంగ సమస్యల పరిష్కారంకోసం ప్రభుత్వ రంగ, ప్రైవేట్, గ్రామీణ బ్యాంకు అధికారులు, సిబ్బంది సమ్మెకు దిగారు. దీంతో జిల్లా వ్యాప్తంగా బ్యాంకులు మూతపడ్డాయి. బ్యాంకులు పనిచేయకపోవడంతో జిల్లాలో కోట్లాది రూపాయల లావాదేవీలు నిలిచిపోయాయి. దీంతో బ్యాంకు వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. బ్యాంకులను నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ సమ్మెకు దిగినట్టు బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

గ్రంథాలయాలకు నిధుల కొరత



- అరకొరగా వస్తున్న సెస్
- 8 శాతం నిబంధన గాలికి
- పుస్తకాల కొనుగోలుకు ఇబ్బందులు
- పోస్టులను భర్తీ చేయని ప్రభుత్వం
- సమస్యల నిలయంగా విజ్ఞాన భాండాగారాలు
- ఐదేళ్లుగా ఉమ్మడి జిల్లాలో ఇదే పరిస్థితి
- చైర్మన్లు బాధ్యతలు స్వీకరించేదెన్నడో?

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)

విజ్ఞాన భాండాగారాలకు నిధుల కొరత ఏర్పడింది. ప్రభుత్వం నుంచి అరకొర సాయమే ఉండగా మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీల నుంచి ఇవాల్సిన సెస్ కూడా అంతంత మాత్రంగానే వస్తోంది. దీంతో గ్రంథాలయాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. సిబ్బంది కొరత, అరొకర పుస్తకాలు, సదుపాయాలు లేకపోవడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు విలువైన పుస్తకాలు అందుబాటులో లేకుండా పోతున్నాయి.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 67 గ్రంథాలయాలు ఉండగా, అందులో 94 మంది ఉద్యోగులకు కేవలం 34 మంది మాత్రమే పనిచేస్తున్నారు. దశాబ్దాలుగా ఉద్యోగ నియామకాలు లేవు. నకిరేకల్‌లో గ్రంథాలయానికి ఉన్న మండల స్థాయి అధికారికి అదనంగా తిప్పర్తి, శాలిగౌరారం మండలాలకు బాధ్యతలు ఇచ్చారు. ఆయన ఈ బాధ్యతలు నిర్వహించడం భారంగా మారింది. అదే విధంగా ఉమ్మడి జిల్లాలోని 67 గ్రంథాలయాల్లో నాలుగు మినహా మిగతావి సొంత భవనాల్లో ఉన్నా అవి శిథిలావస్థకు చేరాయి. అవి మరమ్మతులకు సైతం నోచుకోవడం లేదు. శిథిలావస్థకు చేరిన భవనాలు వర్షాకాలంలో కురుస్తున్నాయి.

అందని సెస్ సొమ్ము

నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయం గ్రేడ్-1గా ఉన్నప్పటికీ నిధుల కొరతతో ఆటు పోట్లు ఎదుర్కొంటోంది. భవనం శిథిలావస్థకు చేరింది. ఇదిలా ఉండగా, మునిసిపాలిటీలు, గ్రామ పంచాతీల నుంచి గ్రంథాలయాలకు సెస్ రావడం లేదు. ఈ గ్రంథాలయాలకు మునిసిపాలిటీల నుంచి రూ.9కోట్ల 50లక్షల 59వేల 764 సెస్ రావాల్సి ఉంది. ఐదుళ్లుగా సెస్ చెల్లింపులు నిలిచిపోయాయి. ఇంటి పన్ను చెల్లింపుల నుంచి 8 శాతం గ్రంథాలయాలకు సెస్ రూపంలో రావాలి. కానీ మునిసిపాలిటీలు, పంచాయతీలు దీన్ని మరిచాయి. మునిసిపాలిటీల నుంచి రూ.9కోట్లకు పైగా సెస్ రావాల్సి ఉండగా, కేవలం రూ.61లక్షల 65వేల 600 మాత్రమే వచ్చాయి. పంచాయతీల నుంచి రూ.29 కోట్ల 17లక్షల 88వేల 911కు రూ.18 కోట్ల 15 లక్షలు వచ్చాయి. ఇంకా రూ.11 కోట్లకు పైగా సెస్ రావాల్సి ఉంది. గ్రంథాలయాల అభివృద్ధి కోసం మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీల నుంచి తప్పని సరిగా సెస్‌ను ఇవ్వాలన్న చట్టం ఉన్నా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక ఈ చెల్లింపులు నిలిచిపోయాయి.


సమస్యలకు నిలయాలు

ఉమ్మడి జిల్లాలోని 67 గ్రంథాలయాల్లో 34 లక్షల పుస్తకాలు ఉండగా, 10 వేల మంది పాఠకులు సభ్యులుగా ఉన్నారు. నిత్యం లక్ష మందికి పైగా పాఠకులు గ్రంథాలయాలకు వస్తున్నారు. గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయాలు 3, గ్రేడ్-2 స్థాయి 3, గ్రేడ్-3 స్థాయి 61 గ్రంథాలయాలు ఉన్నాయి. పాత జిల్లాలో ప్రతి మండల కేంద్రంలో ఒక శాఖా గ్రంథాలయం ఉండగా పునర్విభజన అనంతరం కొత్తగా ఏర్పడిన మండల కేంద్రాల్లో గ్రంథాలయాల ఏర్పాటు ప్రతిపాదనలు రూపొందించలేదు. గ్రంథాలయాల్లో కూర్చోవడానికి సరిపడా కుర్చీలు, బల్లాలు, పుస్తకాలు భద్ర పరిచే ర్యాక్‌లు లేవు. ఇదిలా ఉండగా, ఉమ్మడి జిల్లాల్లోని గ్రంథాలయాలకు చైర్మన్లను ప్రభుత్వం ప్రకటించినా నేటి వరకు నియామక పత్రాలు అందజేయలేదు. చైర్మన్లు బాధ్యతలు తీసుకుంటే కొంతలో కొంతైనా సెస్, నిధులు రాబట్టి గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేసే అవకాశం ఉంది.

కామ్రేడ్ల మరో ప్రయోగం

- టీ-మాస్ పేరుతో మరో వేదిక
- వెనుకబడిన వర్గాల నాయకత్వంలో ముందుకు
- నేటి ప్రారంభ సభకు హాజరు కానున్న తమ్మినేని, గద్దర్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)



సామాజిక పోరాటంలో వెనకబడ్డామన్న అంశాన్ని గుర్తించిన సీపీఎం, సీపీఐ పక్షాలు ఆయా వర్గాలకు చేరువయ్యేందుకు ఎత్తుగడలు ప్రారంభించాయి. అందులో భాగంగా దేశ వ్యాప్తంగా లాల్-నీల్ ఎజెండాతో ముందుకు వెళ్తున్నాయి. దండలో దారం మాదిరిగా ఉంటూ వెనుకబడిన వర్గాలకు సంబంధించిన సామాజిక, ఆర్థిక సమస్యలపై పోరాటం, దాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి ఆయా వర్గాలకు రాజకీయ అధికారం కల్పించడమే లక్ష్యంగా కామ్రేడ్లు కొత్త ఎత్తుగడతో ముందుకు వెళ్తున్నారు. అందులో భాగంగా టీ-మాస్ (ప్రజా సంఘాల ఐక్య వేదిక) పేరిట రాష్ట్ర వ్యాప్తంగా కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. వెనకబడిన సామాజిక వర్గాల సమస్యలే కేంద్రంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గతంలో సుదీర్ఘ పాదయాత్ర చేశారు. దీంతో ఆ వర్గాల అంశాలపై అవగాహన ఉన్న నేతగా టీ-మాస్ నిర్మాణంలో తమ్మినేని ముందడుగు వేశారు. వెనుకబడిన సామాజిక వర్గాలను చైతన్యం చేసే క్రమంలో ఆట-పాటల ద్వారా ఆది నుంచి కృషి చేస్తున్న గద్దర్ సైతం కామ్రేడ్లతో కలిసి పయనించనున్నారు. ప్రధానంగా వివిధ వెనుకబడిన కులాల నాయకులను చేరదీసి అందరి సమస్యలను గుర్తించి వాటిపై సమర భేరి మోగించడమే టీ-మాస్ ఎజెండా. చిట్యాల మండలంలో రాంకీ కంపెనీ రైతుల భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న అంశంపైనా టీ-మాస్ పోరాటం మొదలు పెట్టింది. ఈ తరహాలోనే టీ-మాస్ భవిష్యత్ కాలంలో పనిచేయనుంది. మాదిగ, మాల పోరాట సమితులు, బీసీ సంఘాలు, ముస్లీం, మైనార్టీలను టీ-మాస్‌లో భాగస్వాములుగా చేస్తున్నారు. ఇంతకాలం విడివిడిగా పలు వేదికల్లో పనిచేసిన నాయకులందరినీ ఏక తాటిపైకి తీసుకొచ్చి కనీస ఉమ్మడి ఆందోళన కార్యక్రమాన్ని ఖరారు చేయనున్నారు. ఈ పోరాటాల్లో టీ-మాస్, అందులోని నాయకత్వం ఉత్సాహంగా పనిచేసి ప్రజల్లో మంచి ఆదరణ పొందింతే వచ్చే ఎన్నికల్లో ఉమ్మడిగా బరిలో దిగే విధంగా కామ్రేడ్లు ఆలోచన చేస్తున్నారు. సీపీఎం, సీపీఐతోపాటు వాటి అనుబంధ సంఘాల నాయకులు టీ-మాస్ ఏర్పాటులో కీలక భూమిక పోషిస్తున్నారు. వారు వెన్నుతట్టి బలహీన వర్గాల నాయకులను ముందుపెట్టి ప్రజాదరణ పొందేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో జిల్లాల వారీగా కమిటీల నిర్మాణం, సభలు శరవేగంగా నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. అందులో భాగంగా ఈనెల 23 బుధవారం నల్లగొండలో టీ-మాస్ ఆవిర్భావ సభ జరగనుంది. ఈ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ప్రజాయుద్ధ నౌక గద్దర్‌తోపాటు పలువురు నాయకులు హాజరుకానున్నారు.

నిఘా నీడలో మోడల్ స్కూళ్లు



వేములపల్లి మోడల్ స్కూల్, (ఇన్‌సెట్‌లో) ఏర్పాటుచేసిన సీసీ కెమెరా, పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్

- ఉమ్మడి జిల్లాలో 33 పాఠశాలలు
- ఒక్కో పాఠశాలకు 21 సీసీ కెమెరాలు
- నిర్వహణపై పెరిగిన పర్యవేక్షణ
- నెలరోజుల వరకు డాటా పదిలం

(వేములపల్లి)

విద్యార్థులకు భద్రత కల్పించడంతోపాటు పర్యవేక్షణ చర్యలను బలోపేతం చేసేందుకు మోడల్ స్కూళ్లలో సీసీ కెమెరాలు బిగించారు. పది, ఇంటర్ వార్షిక పరీక్షలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించగా, అందులో భాగంగా ఈ ఏడాది మోడల్ స్కూళ్లలో వాటి ఏర్పాటుకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 33 మోడల్ స్కూళ్లలో సీసీ కెమెరాలు అమర్చారు. ఒక్కో స్కూల్‌కు 21 సీసీ కెమెరాలను ప్రభుత్వం సరఫరా చేసింది. పాఠశాల ఆవరణ, తరగతి గదుల్లో 14 కెమెరాలు, బాలికల వసతి గృహాల్లో 7 సీసీ కెమెరాలను బిగించి ప్రిన్సిపాల్ గదిలో మానిటర్ ఏర్పాటు చేశారు. దీంతో నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి-భువనగిరి జిల్లాల పరిధిలోని మోడల్‌స్కూళ్లన్నీ సీసీ కెమెరాల నిఘా నీడలోకి వచ్చాయి. ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పిస్తున్నారు. మూడేళ్లుగా విద్యార్థినులకు వసతి కల్పిస్తూ కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన చేస్తుండగా, కొన్ని పాఠశాలల్లో సమయపాలన కొరవడింది. కొందరు ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక తరగతి గదిలో విద్యార్థుల క్రమశిక్షణ లోపిస్తోంది. వీటన్నింటినీ గాడిలో పెట్టేందుకు, తరగతి గదుల్లో ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల నడవడికను పసిగట్టేందుకు సీసీ కెమెరాలు ఉపకరిస్తున్నాయి. అదేవిధంగా మండలాల పరిధిలోని మారుమూల గ్రామాలకు చెందిన విద్యార్థినులు పాఠశాల ఆవరణలోని వసతి గృహాల్లో కొన్నేళ్లుగా ఉంటూ విద్యాభ్యాసం సాగిస్తున్నారు. గ్రామాల శివారుల్లో నిర్మించిన హాస్టల్ కావడంతో విద్యార్థినులకు భద్రత కల్పించేలా సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి.

693 సీసీ కెమెరాలు

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి-భువనగిరి జిల్లాల పరిధిలోని 33 మోడల్ స్కూళ్లకు 693 సీసీ కెమెరాలు సరఫరా చేశారు. జూలై మాసాంతంలో వచ్చిన వీటిని ప్రస్తుతం బిగించారు. దీంతో ఫుటేజీల ఆధారంగా ప్రిన్సిపాళ్ల పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. పాఠశాల, హాస్టల్ ప్రవేశ ద్వారం, వరండా, భవనంపై కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి సహాయంతో పాఠశాల, హాస్టళ్లకు వచ్చిపోయే వ్యక్తుల కదలికను సైతం పసిగట్టేందుకు ఇవి ఉపకరిస్తున్నాయి. సీసీ కెమెరాల డాటాను నెలరోజుల పాటు నిక్షిప్తం చేసేందుకు వీలుగా మెమోరీని కూడా సమకూర్చారు.

● పర్యవేక్షణ సులభతరమైంది



పాఠశాల, వసతి గృహాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో సిబ్బంది పనితీరు, విద్యార్థుల నడవడికను ఆఫీసుగదిలో కూర్చొని సులభంగా పర్యవేక్షించే అవకాశం లభించింది. వరండాలో ఏర్పాటు చేసిన కెమెరాల సహాయంతో పాఠశాల ఆవరణలోకి వచ్చిపోయే బయటి వ్యక్తుల కదలికను సైతం పసిగట్టవచ్చు. తరగతి గదుల్లో ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించవచ్చు. ఈ విద్యాసంవత్సరంలో పది, ఇంటర్ వార్షిక పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరిగే అవకాశముంది.

- మంజువాణి, ప్రిన్సిపాల్, వేములపల్లి

● యాదాద్రి సమాచారం



ఉదయం : 4.00 గంటలకు సుప్రభాతం, 4.30: బిందెతీర్థం, ఆరాధన, 5.00 బాలభోగం, 5.30: సర్వ దర్శనాలు ప్రారంభం, 7.30: నిజాభిషేకం, 8.15: సహస్ర నామార్చన, 8.45 సర్వ దర్శనాలు, సుదర్శన నారసింహ యాగం 10.30 నిత్య కల్యాణోత్సవం, **మధ్యాహ్నం :** 12.00 స్వామివారి మహా నివేదన, 1:00 దర్శనాలు తిరిగి ప్రారంభం, **సాయంత్రం :**4.00 ప్రత్యేక దర్శనాలు, 5:00 ఉభయ దర్శనాలు, 6.00 : అలంకార తిరువీధి సేవ, **రాత్రి :** 7.00 మూలవరులకు ఆరాధన, 7.30: సహస్రనామార్చన, 8.15: దర్శనాలు తిరిగి ప్రారంభం, 9.00: నివేదన, 9.30: శయనోత్సవ దర్శనం, 9.45: ద్వార బంధనం.

● సాగర్ సమాచారం




నాగార్జునసాగర్ :

నిల్వ సామర్థ్యం : 590.00 (అడుగులు)
ప్రస్తుతం : 500.20 (అడుగులు)
(115.63 టీఎంసీలు)

నీటి విడుదల


ఎడమ కాల్వ : నిల్
కుడి కాల్వ : నిల్
జలవిద్యుత్ కేంద్రం : నిల్
ఎస్ఎల్‌బీసీ : 362 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో : 509 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో : 509 క్యూసెక్కులు
శ్రీశైలం నీటిమట్టం : 781.90 అడుగులు

● మూసీ సమాచారం




నిల్వ సామర్థ్యం : 645 అడుగులు
ప్రస్తుతం : 638.45 అడుగులు
ఇన్‌ఫ్లో : 176 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో : 40 క్యూసెక్కులు

● పులిచింతల సమాచారం



పూర్తిస్థాయి నీటి నిల్వ: 45 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ : 3.71 టీఎంసీలు
ఇన్‌ఫ్లో : నిల్
అవుట్ ఫ్లో : నిల్

● శాలిగౌరారం ప్రాజెక్టు



శాలిగౌరారం ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 21 అడుగులు కాగా, 20 అడుగులుగా నమోదైంది.

ఆంధ్రజ్యోతి పరిశీలన

దేశంలోనే అత్యంత రద్దీ రహదారుల్లో ఒకటైన హైదరాబాద్ - విజయవాడ 65వ నెంబర్ జాతీయరహదారిపై భద్రత కరువైంది. ఈ రహదారిపై నిత్యం వేలాది మంది ప్రయాణికులు, వందలాది వాహనాలు ప్రయాణిస్తున్నా భద్రత లేకుండా పోయింది. హైవేపై నిరంతరం నిఘా పెట్టాల్సిన హైవే పోలీసింగ్ జాడలేదు. జాతీయ రహదారిని నీడలా వెంటాడాల్సిన సీసీ కెమెరాలు సైతం నామమాత్రంగా పని చేస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలకు నిత్యం సాధారణ వస్తువు నుంచి విలువైన వస్తువుల వరకు సరుకు రవాణా జరుగుతుంటాయి. జాతీయరహదారిపై భద్రత, డొల్లతనం వెల్లడవుతుండడంతో దుండగులకు ఈ రహదారి అనువుగా మారింది. విలువైన సరుకులను దోపిడీ చేసేందుకు ఈ రహదారిని ఎంచుకొని దోపిడీలకు పాల్పడుతున్నారు. అంతేకాకుండా కొన్ని చోట్ల తాము అమర్చుకున్న వాహనంలోనే ప్రయాణికుల్లా ఎక్కి వాహనం నిర్జన ప్రాంతాలకు చేరగానే వాటిని దారి మళ్లించి అందులో ఉన్న ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారు. వీటిని పరిశీలిస్తే జాతీయ రహదారిపై అడుగడుగునా నిఘా డొల్లతనం వెల్లడవుతోంది.

● చౌటుప్పల్, చౌటుప్పల్ రూరల్



హైవేపై జాడలేని నిఘా

జాతీయరహదారిపై భద్రత డొల్ల

పని చేయని సీసీ కెమెరాలు

కనిపించని పెట్రోలింగ్ వాహనాలు

రెచ్చిపోతున్న దోపిడీదారులు

అక్రమాలకు అడ్డాగా హైవే




హైజాక్ చేసిన సిగరెట్ల లోడ్ కంటెయినర్ (ఫైల్)

సంచలనం కలిగించిన సిగరెట్ కంటెయినర్ హైజాక్

ఈ నెల 20న చౌటుప్పల్ మండలం ఖైతాపురం శివారులోని జాతీయ రహదారి పై సినీ ఫక్కీలో లారీని హైజాక్ చేసి రూ.4కోట్లపై చిలుకు విలువైన సిగరెట్‌లను అపహరించడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. అంబర్‌పేట జాతీయ రహదారి వద్ద లారీని హైజాక్ చేసి 30కిలోమీటర్ల వరకు కంటెయినర్ లారీ ప్రయాణించినా పోలీసులకు సమాచారం లేకపోవడం గమనార్హం. బాధితుడు ఫిర్యాదు చేసేంత వరకు హైజాక్‌చేసిన విషయాన్ని పోలీసులు పసిగట్టలేదు. జాతీయరహదారిపై అడుగడుగునా నిఘా ఏర్పాటు చేశామని పోలీసులు చెప్పుకుంటున్నప్పటికీ ఎక్కడా నిఘా వ్యవస్థ కనిపించడం లేదు.

జాతీయరహదారిపై వెలగని హైమాస్ట్ లైట్లు

జాతీయ రహదారిపై హైమాస్ట్ లైట్లు కూడా వెలగడం లేదు. సర్వీస్ రోడ్లపై ఏర్పాటు చేసిన వీధి లైట్లు తరచుగా మరమ్మతులకు గురవుతున్నాయి. నెలలు గడుస్తున్నా వాటిని పట్టించుకోవడం లేదు. పట్టణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ వీధి లైట్లు లేకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. జాతీయ రహదారిపై సరైన లైటింగ్ వ్యవస్థ లేకపోవడంతో దోపిడీ దొంగలు అర్ధరాత్రి వేళ యథేచ్ఛగా సంచరిస్తున్నారు. జాతీయ రహదారిపై వాహనాల్లో తిరుగుతూ ప్రణాళికబద్ధంగా అరాచకాలకు పాల్పడుతున్నారు. జాతీయ రహదారి వెంట ఉన్న చౌటుప్పల్, చిట్యాల, కేతేపల్లి, కట్టంగూర్, నకిరేకల్ తదితర ప్రాంతాల్లో అమర్చిన హైమాస్ట్ లైట్లు నిత్యం మొరాయిస్తుండడంతో చీకట్లు అలుముకుంటున్నాయి.



కేతేపల్లిలో జాతీయ రహదారిపై వెలగని హైమాస్ట్ లైట్లు

అక్రమ దందాలకు హైవే అడ్డా

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి అక్రమ దందాలకు అడ్డాగా మారింది. దేశంలో అత్యంత రద్దీగా ఉండి అనేక రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు సంచరిస్తుంటాయి. లక్షలు, కోట్ల విలువైన సరుకు రవాణా జరుగుతుంది. ఇదే తరహాలో హైవేపై అక్రమ దందా వ్యాపారం కొనసాగుతోంది. హైవేపై పోలీసుల భద్రత డొల్లగా ఉండడంతో అక్రమ దందా వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. అర్ధరాత్రి వేళ ఈ అక్రమ దందా రవాణా జోరుగా కొనసాగుతోంది. ఇసుక రవాణా నుంచి గంజాయి స్మగ్లింగ్ వరకు హైవేపై అక్రమ దందా నడుస్తోంది. జాతీయరహదారిపై ఎలాంటి భద్రత చర్యలు చేపట్టకపోవడంతో అక్రమ దందా వ్యాపారులు రెచ్చిపోతున్నారు. అర్ధరాత్రి అయ్యిందంటే చాలు వందకు యాభై లారీల్లో అక్రమ సరుకు రవాణా జరుగుతుందంటే వ్యాపారం ఎలా కొనసాగుతుందో తెలుసుకోవచ్చు. అక్రమ ఇసుక రవాణా, కెమికల్, కలప రవాణా, గ్రానైట్ అక్రమ రవాణా, కల్తీ సరుకుల రవాణాతో పాటు ఆవుల తరలింపు, రేషన్ బియ్యం దందా లాంటి అనేక అక్రమ వ్యాపారాలు హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి మీదుగా నడుస్తున్నాయి. లారీల్లో సరుకులను తరలిస్తున్నారు. కాగా పోలీసులకు తెలియకుండా ఈ అక్రమ దందా కొనసాగే అవకాశం లేదు. మామూళ్ల మత్తులో ఉన్న పోలీసులు ఈ అక్రమ దందాకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



నామమాత్రంగా నిఘా కెమెరాలు

జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని పోలీసులు ప్రకటిస్తున్నా, సీసీ కెమెరాలు ఎక్కడా పనిచేసిన దాఖలాలు కనిపించడం లేదు. జాతీయరహదారిపై ఉన్న కొన్ని పరిశ్రమల ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా నామమాత్రంగానే పని చేస్తున్నాయి. అర్ధరాత్రి వేళ నిఘా కెమెరాలు పని చేయడం లేదు. అపహరణకు గురైన కంటెయినర్ లారీ ఖైతాపురం వద్ద నిలిపిన ప్రాంతంలో సీసీ కెమెరా ఉన్నప్పటికీ అర్ధరాత్రి కావడంతో సీసీ పుటేజ్‌లో దృశ్యాలు స్పష్టంగా కనిపించడం లేదు. లారీ, సుమోలు సీసీ పుటేజ్‌లో ఉన్నా స్పష్టత కరువైంది. దీంతో పోలీసులకు కేసును ఛేదించడం సవాలుగా మారింది. నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో జాతీయ రహదారి-65 విస్తరించి ఉంది. దాదాపు తెలంగాణ ప్రాంతంలో 180 కిలోమీటర్ల మేర రహదారి విస్తరించి ఉంది. కొన్ని ముఖ్యమైన పట్టణాల్లో మాత్రమే సీసీ కెమెరాలు అమర్చారు. అవి కూడా అలంకార ప్రాయంగా మారాయి. అర్ధరాత్రి సైతం పని చేసే కెమెరాలు లభిస్తున్నా పాత సీసీ కెమెరాలను అమర్చడంతో కేసులను ఛేదించడం పోలీసులకు సమస్యగా మారింది.

జాతీయరహదారిపై కనిపించని హైవే పెట్రోలింగ్



జాతీయ రహదారిపై హైవే పెట్రోలింగ్ వాహనాలను పోలీసులు రద్దు చేశారు. గతంలో జాతీయరహదారిపై రెండు పోలీస్ స్టేషన్లకు ఒక పెట్రోలింగ్ వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం, రాత్రి వేళల్లో ఈ పెట్రోలింగ్ వాహనం జాతీయ రహదారిపై గస్తీ తిరిగేది. ఇటీవల ఈ వాహనాలను పోలీసులు రద్దు చేశారు. హైవేపై పోలీసుల నిఘా లేకపోవడంతో దోపిడీదారులు రెచ్చిపోయి అనేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దొంగతనాలు, దోపిడీలు, హత్యలకు జాతీయ రహదారి అడ్డాగా మారింది. జాతీయ రహదారిపై ఉన్న చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూర్, నకిరేకల్, కేతేపల్లి, సూర్యాపేట, చివ్వెంల, కోదాడ, మునగాల మండలాల్లో పెట్రోలింగ్ వాహనాలు రద్దు కావడం కూడా దోపిడీదారులకు, దొంగతనాలకు అవకాశంగా మారింది. స్థానిక పోలీసులు మాత్రమే కొన్ని చోట్ల జాతీయ రహదారిపై అవసరమైన సందర్భాల్లో పెట్రోలింగ్ చేస్తున్నారు.

హైవేపై దోపిడీల చిట్టా...

నాలుగు సంవత్సరాల క్రితం ఇదే విధంగా సిగరెట్ల దోపిడీ జరిగింది. హైదరాబాద్ నుంచి డీసీఎం వాహనంలో రూ.50లక్షల సిగరెట్ పెట్టెలతో తరలిస్తుండగా ఎల్‌బీ నగర్ వద్ద కొంతమంది ప్రయాణికుల్లా ఎక్కారు. చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట శివారులోకి రాగానే డ్రైవర్‌ను చితకబాది, దండు మైలారం రోడ్డులోకి తరలించి సిగరెట్ పెట్టెలను అపహరించి డీసీఎంను వదిలివెళ్లారు. ఎల్‌బీనగర్ నుంచి బయలుదేరిన ఓ ఇండికా కారులో ప్రయాణికులను ఎక్కించుకున్న దుండగులు ధర్మాజిగూడెంకు రాగానే గుట్టల ప్రాంతానికి తీసుకెళ్లి ప్రయాణికుల వద్దనున్న బంగారం, నగదును అపహరించారు. చౌటుప్పల్‌లోని ఓ పెట్రోల్ బంక్‌లో కారులో డీజిల్ పోసుకున్న దుండగులు సిబ్బందిపై దాడి చేసి నగదు డబ్బులతో ఉడాయించారు. సంవత్సరంన్నర క్రితం హార్లిక్స్ లోడ్‌తో వెళ్తున్న లారీని మల్కాపురం వద్ద దుండగులు అటకాయించి లారీ లోడ్ హార్లిక్స్ డబ్బాలను అపహరించారు. గత 9నెలల క్రితం జిల్లేడు చెల్క వద్ద కెమికల్ లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వాహనాన్ని దుండగులు అడ్డగించి లక్షల విలువ చేసే కెమికల్ డ్రమ్‌లను దొంగిలించారు. ఇటీవల గుంటూరుకు చెందిన ఓ మహిళను కారులో ఎక్కించుకొని అత్యాచార యత్నానికి పాల్పడ్డారు. ఆమె పంతంగి టోల్‌గేట్ వద్ద తప్పించుకొని పరారైంది. రెండు నెలల క్రితం శ్రీకాకుళం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న గంజాయి ముఠాను పంతంగి టోల్ గేట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. అదే విధంగా నెల రోజుల క్రితం కూడా పంతంగి టోల్ గేట్ వద్ద గంజాయి ముఠాను పట్టుకున్నారు. అదే విధంగా సూర్యాపేట, కోదాడ ప్రాంతాల్లో లారీలపై ఉన్న తాటిపత్రిలను కోసి వేసి అందులో ఉన్న సరుకులను దొంగిలించడం పరిపాటిగా మారింది. సూర్యాపేటలో గత సంవత్సరం జాతీయ రహదారిపై నిలిపిన ఇన్నోవా వాహనాన్ని దుండగులు అపహరించారు. అదే విధంగా హత్యలకు అడ్డాగా మారింది. దండుమల్కాపురం, లక్కారం, లింగారెడ్డిగూడెం, ఖైతాపురం, తుప్రాన్‌పేట పరిధిలో జాతీయరహదారి పక్కన అనేక హత్యలు జరిగాయి. ఈ జాతీయ రహదారి పైనే అరాచక శక్తులు రెచ్చిపోవడానికి రహదారి రద్దీగా ఉండడమే కారణంగా తెలుస్తుంది. వాహనాలను పక్కన నిలిపిన పట్టించుకునే వారు ఉండరు. రోడ్లకు ఇరువైపులా గుట్టలు ఉండడం, ఓ వాహనం నుంచి మరో వాహనంలోకి సరుకులను అన్‌లోడ్ చేయడం సులువుగా ఉంటుంది. బాధితులను గుట్టల ప్రాంతంలో వదిలి పెడితే వారు హైవే ఎక్కేసరికి దోపిడీదారులు వెళ్లిపోవడానికి అనువుగా ఉంటుంది. పోలీస్ నిఘా సైతం సక్రమంగా లేకపోవడంతో దోపిడీదారులు రెచ్చిపోతున్నారు.

రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

సంస్థాన్‌నారాయణపురం: పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు, మెలకువలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి కె.మల్లారెడ్డి కోరారు. మండలంలోని చిమిర్యాల గ్రామంలో మంగళవారం రైతులు సాగు చేసిన పత్తి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం స్వామి, ఏఈవో మాదగోని నర్సింహా, రైతులు శంకరయ్య, బక్కయ్య, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల రహదారులను అభివృద్ధి చేయాలి

భూదాన్‌పోచంపల్లి : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు ఆర్భాటపు ప్రకటనలు చేస్తుంది తప్ప ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం లేదని బీజేపీ భువనగిరి అసెంబ్లీ కన్వీనర్ ఎన్నం శివకుమార్ విమర్శించారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల రహదారులను అభివృద్ధి చేయాలని మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి, ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్ల సమస్యలపై ఎంపీడీవో నరేందర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. శివారెడ్డిగూడెం నుండి దంతూరు వరకు బీటీ రోడ్డు నిర్మించాలని, జగత్‌పల్లి నుండి పిలాయిపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మించాలని, వంకమామిడి - శేరిల్లా వరకు రోడ్డు నిర్మించాలని, పోచంపల్లి నుండి బీబీనగర్ వరకు డబుల్ రోడ్డు పనులు పూర్తి చేయాలని, ఇంద్రియాల వద్ద మూసీ నదిపై జంపల్లి వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు చింతల రామకృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ ఎన్నం శివకుమార్, మండల నాయకులు నోముల గణేష్, కేసారం కృష్ణారెడ్డి, ఏలె శ్రీనివాస్, గంజి బస్వలింగం, బండిరాల సుశీల, నర్ల నర్సింగ్‌రావు, కొంతం శంకర్ గౌడ్, రచ్చ సత్యనారాయణ, సీత లక్ష్మయ్య, పాముకుంట్ల బస్వయ్య, ఊడుగు వెంకటేశం గౌడ్, నూనె సహదేవ్, డబ్బీకార్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



పోచంపల్లిలో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు



విద్యార్థినికి టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

కస్తూర్బా గాంధీ విద్యాలయంలో టీకాలు

చౌటుప్పల్ టౌన్: చౌటుప్పల్ మండల కేంద్రంలోని కస్తూర్భా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం మిజీల్స్, రూబెల్లా వ్యాధి నిరోధక టీకాలను విద్యార్థినులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వేశారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రత్యేకాధికారిని కె.భవాని, ఆరోగ్యశాఖ అధికారులు సత్యనారాయణ, హెల్త్‌అసిస్టెంట్ శ్రీనివాస్, ఇందిర, సలీం, కృష్ణవేణి పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యావిధానంతోనే మార్పు

చౌటుప్పల్: శాస్త్రీయవిద్యావిధానంతోనే సమాజంలో మార్పు జరుగుతుందని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి అన్నారు. పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జేబీఎం వొకేషనల్ కళాశాలలో శాస్త్రీయ విద్యావిధానంపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. కార్యక్రమలో జిల్లా అధ్యక్షుడు తుపాకుల ముత్యాలు, మండల అధ్యక్షుడు సందీప్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ జంగయ్య, నాయకులు శివ, సాయి, గణేష్, ప్రవీన్, ప్రకాష్, అరుణ్ కుమార్, మచ్చేందర్, నదీప్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించండి : ఎంఈవో

చౌటుప్పల్ టౌన్: చౌటుప్పల్ మండలంలో అక్రిడేషన్ అర్హత ఉన్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యను అందించాలని మండల విద్యాధికారి బి.రాములు ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఉచిత విద్యను అందించాలని ఆయన ఆదేశించారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీశైలంగౌడ్

గ్రామాభివృద్ధికి సహకరించాలి

భూదాన్‌పోచంపల్లి : మండల పరిధిలోని దంతూరు గ్రామాభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ బత్తుల శ్రీశైలంగౌడ్ మంగళవారం ఎక్సైజ్‌శాఖ మంత్రి పద్మారావును కలిసి వినతిపత్రం అందజేశారు. దంతూరు గ్రామాభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు ఈ సందర్భంగా సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగాల వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ తవ్వకాలపై సర్వే

భూదాన్‌పోచంపల్లి: ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి మైనింగ్ తవ్వకాలు నిర్వహిస్తే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మైనింగ్‌శాఖ జూనియర్ అసిస్టెంట్, ఏఈ జెఎల్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మైనింగ్ జోన్‌లో ఆయన సర్వే నిర్వహించారు. మైనింగ్ లీజ్ ప్రభుత్వ పరంగా జరుగుతున్నాయా లేవా పరిశీలించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నామని, ఉన్నతాధికారులకు నివేదిక అందివ్వనున్నట్లు ఆయన తెలిపారు.

గ్యాస్ సమాచారం

చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, సంస్థాన్‌నారాయణపురం మండలాల వినియోగదారులు ఈ నెల 21 నుంచి 22 వరకు బుకింగ్ చేసుకున్నా వారికి బుధవారం గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయబడును.

సినిమాలు

చౌటుప్పల్

అంజిరెడ్డి - జయ జానకి నాయక
శ్రీనివాస - నేనే రాజు నేనే మంత్రి

భూదాన్‌పోచంపల్లి

సాయిరాం : పటేల్ సార్

తపాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సంస్థాన్‌నారాయణపురం : తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి తపాలా ఉద్యోగులు మండల కేంద్రంలో చేపట్టిన సమ్మె మంగళవారం 7వ రోజుకు చేరుకుంది. సమ్మెలో తపాల సిబ్బంది బల్లెం రామస్వామి, కృష్ణారెడ్డి, చిరంజీవి, కృష్ణస్వామి, పాండు, వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న సమ్మెలో భాగంగా తపాలా ఉద్యోగులు పోచంపల్లిలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో కరగల్ల కుమార్, టి.భిక్షపతి, వై.యాదగిరి, కె.లక్ష్మణ్, వి.యాదయ్య, శ్రీకాంత్, జనార్ధన్, లక్ష్మయ్య, నర్సింహ, భాను పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్: మండల కేంద్రంలోని ఉపతపాలా కార్యాలయం ఎదుట వంటావార్పుతో గ్రామీణ తపాలా ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎం.నర్సింహాచార్యులు, రామస్వామి, నామని రాజేష్, మసూద్ షరీఫ్, కిషన్‌రావు, యాదగిరి, సాయి, భవానీ, భార్గవి, చంద్రయ్య, వెంకయ్య, బీకోజి పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలి



వలిగొండలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ ఉద్యోగులు

చౌటుప్పల్ రూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని సెప్టెంబర్ 1న సామూహిక సెలవు దినంగా పాటిస్తున్నట్లు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవీందర్ తెలిపారు. మంగళవారం తంగడపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మోటే సత్తయ్య, మాధవరెడ్డి, రవీందర్, రమేష్, శ్వేత పాల్గొన్నారు.

వలిగొండ: కాంట్రీబ్యూటరీ పెన్షన్ విధానం రద్దుకు సెప్టెంబర్ 1న నిర్వహించ తలపెట్టిన కిలాఫత్ దివాస్ దీక్షను విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరమణ ఉపాధ్యాయ, ఉద్యోగులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీనివాస్, కుమారస్వామి, కోటేశ్వరరావు, అంజయ్య, నరేందర్ రెడ్డి, నర్సింహా, యాదయ్య, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

రామన్నపేట: పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

టీమాస్ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి

వలిగొండ : తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక(టిమాస్) ఆధ్వర్యంలో భువనగిరిలో ఈనెల 29న నిర్వహించతలపెట్టిన టీమాస్ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కూరపాటి రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని అతిధిగృహంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక రౌంట్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాఅధ్యక్షుడు వేముల మహేందర్, కల్కూరి రామచందర్, మద్దెల రాజయ్య, సిర్పంగి స్వామి, చాట్ల పాండు, గంజి నారాయణ, సాయిని యాదగిరి, బొలుగు నర్సింహా, ఎస్‌కె సమాద్, గొలుసుల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

విద్యార్థుల సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులను నడిపించాలి

చౌటుప్పల్ టౌన్: గ్రామీణ ప్రాంత విద్యార్థుల సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులను నడిపించాలని టీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు ఒంటెద్దు లింగస్వామి కోరారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన టీఆర్ఎస్వీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో లింగస్వామి, బాలకృష్ణ, అప్సర్, ఏడుకొండలు, నాగరాజు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

చౌటుప్పల్: మైనార్టీ గురుకులంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వైసీపీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ రహీం షరీఫ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు మాదగోని జంగయ్యగౌడ్, బైకాని నరేందర్, ఎన్నీదుల మహేష్, ఎస్.భాను తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలి : తహసీల్దార్

రామన్నపేట : గణేష్ నవరాత్రోత్సవాలను, బక్రీద్ వేడుకలను ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని తహసీల్దార్ జి.లక్ష్మి, ఎంపీడీవో కె.జానకిరెడ్డిలు కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన శాంతిసంఘం సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయబ్ తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, ఏఎస్ఐ ఎంఏ రషీద్, సర్పంచ్‌లు, శాంతిసంఘం సభ్యులు నకిరేకంటి మొగులయ్య, పూస బాలనర్సయ్య, పోచబోయిన మల్లేశం, నర్ర నర్సింహా, జెల్లల పెంటయ్య, బట్టే కృష్ణమూర్తి, వెంకటేష్, వనం చంద్రశేఖర్, ఎండీ మన్సూరలీ, ఇనాయత్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.





మునిసిపాలిటీల్లో భవన నిర్మాణాలకు అనుమతులు కావాలంటే కాసులు కురిపించాల్సిందే... నిర్మాణాల అనుమతులకు చెల్లించాల్సిన ఫీజులతోపాటు అదనంగా లంచాలు ముట్టజెప్పందే పర్మిషన్ పొందడం కుదరని పని. చిన్న భవనాలైతే వేలల్లో, బహుళ అంతస్తుల భవనాలైతే లక్షల్లో నజరానా ఇచ్చుకోవాల్సిన పరిస్థితి. లంచాలు ముట్టజెప్పని నిర్మాణాలపై డేగకన్ను వేస్తున్న ప్రణాళికా అధికారులు నిర్మాణ స్థలంలో కాకుల్లా వాలి పోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో సామాన్య ప్రజల ఇంటి కల నెరవేరాలంటే ప్రస్తుతం పరిస్థితుల్లో గగనమవుతోంది...

(రామగిరి/మిర్యాలగూడ టౌన్/కలెక్టరేట్ సూర్యాపేట/కోదాడ)

అవినీతికి ప్రణాళిక

ABN ఆంధ్రజ్యోతి నిఘా

- లంచావతారమెత్తిన టౌన్ ప్లానింగ్ అధికారులు
- చేయి తడపనిదే కదలని ఫైళ్లు
- నిబంధనలను తుంగలో తొక్కుతున్న గృహ నిర్మాణదారులు
- చూడనట్లు వదిలేస్తున్న అధికార యంత్రాంగం
- అనుమతుల విషయంలో మితిమీరిన రాజకీయ జోక్యం
- మునిసిపల్ టౌన్ ప్లానింగ్‌లో అక్రమాల దొంతర
- సామాన్యుడు ఇల్లు కట్టుకోవాలంటే సంవత్సరంలో సగం మునిసిపాలిటికే

నల్లగొండ మునిసిపల్ పరిధిలో అక్రమ కట్టడాలు ఆకాశాన్నంటుతున్నాయి. నిబంధనల మేరకు నిర్మించాల్సిన భవనాల యజమానులు ఆ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. తప్పని పరిస్థితుల్లో అనుమతి తీసుకోవాల్సి వస్తే ఒక ఫ్లోర్‌కు అనుమతి తీసుకుని మరో రెండు అంతస్తులు అనుమతులు లేకుండా నిర్మించడం ఇక్కడ పరిపాటిగా మారింది. రాజకీయ నాయకులు నా వైపు ఉన్నారంటూ భరోసాతో కొంతమంది భవన యజమానులు యథేచ్ఛగా అక్రమ కట్టడాలు చేపడుతున్నారు. మితిమీరిన రాజకీయ జోక్యం వల్ల స్పందించాల్సిన మునిసిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు మిన్నకుండా ఉండి పోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రకాశం బజార్‌నుంచి నటరాజ్ థియేటర్ వైపు వెళ్లేరోడ్డులో ఓ భవన నిర్మాణదారుడు కనీసం సెట్‌బ్యాక్ కూడా లేకుండా నిర్మిస్తున్నాడంటే నిబంధనలను ఏ మేరకు పాటిస్తున్నాడో తెలిసిపోతుంది. అదేవిధంగా శివాజినగర్‌లోని సాయిబాబా గుడి సమీపంలో ఓ బహుళ అంతస్తుల భవన నిర్మాణదారుడు కూడా నిబంధనలను అతిక్రమించి నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలుస్తుంది. దీంతోపాటు ఆర్టీసీ కాలనీలో మరో కమర్షియల్ భవన నిర్మాణానికి హైదరాబాద్ నుంచి అనుమతి రాకముందే పనులు పూర్తి చేశారు. ఇలా జిల్లాకేంద్రంలో అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎన్నో భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. కొంతమంది రాజకీయ నాయకులు అక్రమ నిర్మాణాల్లో తలదూర్చి తమవంతు వాటాలను వసూలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా, సాధారణ పౌరులు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంటే ఆ అనుమతులు పొందేందుకు కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సిందే.. అనుమతులు పొందాలంటే చేతులు తడిపితేనే పని అవుతుందంటూ కొంతమంది గృహ నిర్మాణదారులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విభాగంపై దృష్టి సారించి అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



‘పేట’లో పైసలు లేనిదే ఫైలు కదలదు

ఇంటి నిర్మాణంకోసం దరఖాస్తులు చేసుకుంటే నెలల తరబడి కార్యాలయాల తిప్పుకుంటున్నారు. పైసలు లేనిదే ఫైల్ కదలదన్నట్లుగా మారింది సూర్యాపేట మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు. వారికి నచ్చితే ఎలాంటి నిబంధనలు పాటించకున్నా అనుమతులు ఇస్తున్నారు. అన్నీ సరిగానే ఉన్నా ఏదో ఒక సాకుతో అనుమతులను పెండింగ్‌లో పెడుతున్నారు. ధనవంతులు నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేస్తున్నా... చేసినా అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. జిల్లాకేంద్రంలోని పలువురు వార్డు కౌన్సిలర్లు వారి వార్డుల్లో ఇంటిని నిర్మించుకోవాలంటే ఖచ్చితంగా సదరు కౌన్సిలర్‌ను ప్రసన్నం చేసుకోవాల్సిందే లేదంటే టౌన్ ప్లానింగ్ అధికారులకు చెప్పి ఇంటి నిర్మాణానికి అనుమతులు రాకుండా అడ్డుకుంటున్నారు. అన్నీ సరిగ్గానే ఉన్నాయని తనకు ఇంటి అనుమతులు ఎందుకు ఇవ్వడం లేదని టౌన్ ప్లానింగ్ అధికారులను ప్రశ్నిస్తే మీవార్డు కౌన్సిలర్‌ను కలవాలని అధికారులే సూచిస్తుండం గమనార్హం.

డబ్బులు ఇస్తేనే అనుమతులు

మునిసిపల్ టౌన్‌ప్లానింగ్ శాఖలో ఇంటి నిర్మాణానికి డబ్బులు ఇస్తేనే అనుమతులు ఇస్తున్నట్లు పలువురు దరఖాస్తు దారులు ఆరోపిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఇంటి నిర్మాణ అనుమతుల కోసం ఫీజు చెల్లించి దరఖాస్తులు చేసుకుంటే ఏదో ఒక సాకుతో అనుమతులు ఇవ్వడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. జిల్లా కేంద్రంలో ఉన్న భవనాలు మున్సిపల్ నిబంధనల ప్రకారం నిర్మించి ఉండాలి. కానీ అధిక శాతం నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినవే. రోడ్లను ఆక్రమించి, ఎలాంటి అనుమతులు లేకుండా, అనుమతులు తీసుకున్న దానికంటే అదనంగా నిర్మాణాలు చేసినా... చేస్తున్నా పట్టించుకోవడం లేదు. జిల్లా కేంద్రంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రెండు భవనాలకు సెల్లార్ అనుమతి లేదు. అయినా వారు సెల్లార్ నిర్మాణం మాత్రం యథేచ్ఛగా చేస్తున్నారు. ఇలాంటి నిర్మాణాలు సూర్యాపేటలో వందల సంఖ్యలో ఉన్నాయి.

నెలకు వందకు పైగా నిర్మాణాలు

సూర్యాపేట జిల్లా కేంద్రంలో నెలకు వందకు పైగా నిర్మాణాలు జరుగుతున్నాయి. అందులో ఇటీవల నూతనంగా ఏర్పడిన కాలనీల వైపు నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆన్‌లైన్ ద్వారా సీడీఎంఏ హైదరాబాద్‌కు పంపుతారు. అక్కడ దరఖాస్తులను పరిశీలించిన అధికారులు సక్రమంగా ఉంటే వెంటనే సంబంధిత వెబ్‌సైట్‌లో అనుమతులు మంజూరు చేయాలని సూచిస్తారు. ఈ విధంగా ఒక్కో ఇంటి నిర్మాణ అనుమతికి కనీసం 20రోజుల సమయం పడుతుంది.

అక్రమ నిర్మాణాలకు అండదండలు

మిర్యాలగూడ పట్టణ ప్రణాళికా సిబ్బంది అవినీతి కారణంగా అక్రమ నిర్మణాలు వెలుస్తున్నాయి. కనీస నిబంధనలు పాటించకుండా రోడ్డు స్థలాన్ని సైతం ఆక్రమించుకుని కట్టుబడి చేస్తున్నారు యజమానులు. నమూనా ప్లాన్‌లో ఒకరకంగా ఉంటే క్షేత్రస్థాయిలో మరోరకంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. ఒకట్రెండు అంతస్తులకు పర్మిషన్ తీసుకుని నాలుగైతు అంతస్తులు నిర్మిస్తుండడం విశేషం.

ఆన్‌లైన్‌లోనూ అక్రమాలే..

అక్రమ నిర్మాణాలను అరికట్టడం కోసం ప్రభుత్వం ఆన్‌లైన్ అనుమతుల విధానం అమల్లోకి తీసుకొచ్చింది. అయితే దళారులు, మధ్యవర్తులు అనుమతుల విషయంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. 2016 జూన్ 11నుంచే ఆన్‌లైన్ అనుమతులు విధానం అమల్లోకి వచ్చినప్పటికీ ఈ విధానంపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో లైసెన్స్‌డ్ సర్వేయర్ల పాత్రకీలకంగా మారింది. మ్యాప్ గీయడం దగ్గర నుంచి నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు అంతా తామై వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

అటకెక్కిన ఆన్‌లైన్ మ్యుటేషన్..?

అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు రిజిస్ట్రేషన్ శాఖ, పురపాలక శాఖల మధ్య సమన్వయంతో ఆన్‌లైన్ మ్యుటేషన్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. అయితే ఆయా శాఖల మధ్య సమన్వయం లోపించడంతో పక్షం రోజుల్లో జరగాల్సిన మ్యుటేషన్ ఆరు నెలలైనా జరగడం లేదు. ఈ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన పురపాలక యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో పట్టణ ప్రణాళికా అధికారుల ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా మారింది.

మునిసిపల్ ఆదాయానికి గండి

అక్రమ నిర్మాణాలతో మునిసిపల్ ఆదాయానికి గండి పడుతోంది. భవన నిర్మాణ అనుమతుల విషయంలో ఒక్కో అంతస్తుకు ఒక్కోవిధంగా ఫీజు చెల్లించాల్సిఉండగా, లైసెన్స్‌డ్ సర్వేయర్ల సలహా సంప్రదింపులతో పర్మిషన్ ఒకలాగా తీసుకుని మరోలా నిర్మాణ పనులు జరుపుతున్నారు. దీంతో మునిసిపల్ ఆదాయానికి గండిపడుతోంది. మరోవైపు పట్టణ శివార్లలో వెలుస్తున్న అక్రమ వెంచర్ల నిర్వాహకులు లేఅవుట్ పర్మిషన్ పొందకుండా ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం విశాలవంతమైన రహదారుల కోసం స్థలాన్ని విడవడంతోపాటు వెంచర్లలో పార్కు, దేవాలయానికి స్థలం కేటాయించాల్సిఉంది. అయితే అధికారులకు లంచాలు ముట్టజెప్పి లేఅవుట్ లేకుండా పట్టణంలో వెంచర్లు వెలవడం విశేషం.

ఇల్లు కట్టాలంటే చేయి తడపాల్సిందే..!



హుజూర్‌నగర్‌లో ఇల్లు కట్టాలంటే ముందుగా అధికారుల చేయి తడపాల్సిందే. చేతిలో కాసులు పడితేనే ఫైలు కదులుతుంది. దానికి తోడు రాజకీయ నాయకుల మితిమీరిన జోక్యంతో ఇల్లు కట్టే యజమానికి దిమ్మ తిరుగుతుంది. అన్నీ సక్రమంగా ఉంటే సరే సరి..., ఇక కాగితాలు, పర్మిషన్లు లేకపోతే కాసులు విదిలించాల్సిందే మరి. హుజూర్‌నగర్‌లో ఎక్కడైనా ఇల్లు కడితే ముందుగా రాజకీయనాయకులు సైగలు చేస్తారు. వెంటనే నగర పంచాయతీ అధికారులు వాలి పనులు ఆపించేస్తారు. ఇటీవల హుజూర్‌నగర్‌లో ఒక ప్రభుత్వ ఉద్యోగి ఇల్లు కట్టేందుకు పర్మిషన్ కోసం నగర పంచాయతీ టౌన్ ప్లానింగ్ అధికారి వద్దకు వెళ్లాడు. ఆయనకు అన్నీ కాగితాలు ఉన్నాయి. కానీ, ఐదు గజాల స్థలం ఎక్కువ ఉందంటూ ఇంటి స్థలాన్ని రెండుగా విడగొట్టారంటూ పేచీ పెట్టాడు. దీంతో ఒక వార్డు కౌన్సిలర్ రంగంలోకి దిగినా అనేక ఇబ్బందులు తలెత్తాయి. మరోచోట ఒక రాజకీయ నాయకుడు పర్మిషన్ కోసం ఏకంగా లక్షపైగానే వసూలు చేశాడు. దాంతో లక్ష ఇచ్చినా పర్మిషన్ లేకుండా ఇల్లు కట్టుకోవాల్సి వచ్చింది. హుజూర్‌నగర్‌లోని అనేక దుకాణాలు, కల్యాణ మండపాలకు పర్మిషన్ లేదు. వీటి నిర్మాణం వెనుక లక్షల రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. కొంతమంది రాజకీయ నాయకుల జోక్యంతో కాసుల గలగలలు మారుమోగుతున్నాయి.

భువనగిరి మునిసిపాలిటీలో ప్లానర్స్‌దే జోరు



(భువనగిరి టౌన్)

భవన నిర్మాణ అనుమతులపై భువనగిరి మునిసిపాలిటీలో విచిత్రకరమైన పరిస్థితి నెలకొంది. ఇంటి నిర్మాణ నక్ష గీసే ప్లానర్సే కీలకమవుతున్నారు. గత ఏప్రిల్‌నుంచి భవన నిర్మాణ అనుమతుల్లో ఆన్‌లైన్ విధానం అమలులోకి వచ్చింది. కానీ, అక్రమాలకు మాత్రం తెరపడలేదు. భవనం నిర్మించాలని అనుకున్న యజమాని మొదటగా ప్లానర్‌ను సంప్రదించడం సహజమే.. దీంతో ఇదే అదనుగా నక్ష గీయడం, అనుమతులకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం, చివరగా అనుమతులు ఇప్పించడం వరకు తమదే బాధ్యత అంటూ యజమానితో ప్లానర్స్ ప్యాకేజీ మాట్లాడుకుంటున్నారు. ప్యాకేజీలో మునిసిపల్ యంత్రాంగానికి వాటా ఇస్తున్నామని ప్లానర్స్ బహిరంగంగా పేర్కొంటున్నారు. మరికొందరు భవన యజమానులు హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ప్లాన్ రూపొందించి... ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్నారు. అయితే అధికారులు మాత్రం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో పౌరసేవా పత్రం ప్రకారం అనుమ తులు ఇవ్వడం లేదా తిరస్కరణకు గురి చేస్తున్నాయని, కార్యాలయం వెలుపల చెల్లింపుల వ్యవహారానికి తమకు సంబంధంలేదని పేర్కొంటున్నారు. గత రెండ నెలల నుంచి 14శాతం ఎల్‌ఆర్‌ఎస్, 33శాతం కాంపోండింగ్ ఫీజు విధిస్తూ అనుమతులు ఇస్తున్నామని, అక్రమ నిర్మాణాలు, అవకతవకలకు ఆస్కారం ఇవ్వడం లేదని అధికారులు చెబుతున్నారు. భవన నిర్మాణ దారులు మాత్రం అనుమతులకోసం దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి నిర్మాణ పనులు పూర్త య్యేవరకు తమపై అదనపు భారం పడుతోందని వాపోతున్నారు. చెల్లింపులు లేకుండా భవన నిర్మాణ అనుమతులు పొందడం కష్టమవుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

నగరపంచాయతీలో కౌన్సిలర్లదే హవా



దేవరకొండ టౌన్ : దేవరకొండ నగరపంచాయతీలో ఏ అనుమతి కావాలన్నా... ఏ పనులు కావాలన్నా.. కౌన్సిలర్ల అనుమతి తప్పనిసరి. గతంలో దేవరకొండ గ్రామపంచాయతీలో గృహ నిర్మాణాలు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలపై సర్వసభ్య సమావేశాల్లో అనుమతి పొందేది. ప్రస్తుతం నగరపంచాయతీకి మారిన తరువాత తెలంగాణ రాష్ట్రంలో ఆన్‌లైన్ ద్వారా అనుమతులు పొందేందుకు ప్రభుత్వం వెసలుబాటు కల్పించింది. ప్రతి విషయంలో కార్యాలయాలకు వచ్చే ప్రజలు మొట్టమొదటిగా కౌన్సిలర్లను ప్రసన్నం చేసుకోవాల్సిందే. కొంతమంది కౌన్సిలర్‌లు ఇటు ఉద్యోగులను, అటు ప్రజలను బ్లాక్ మెయిల్ చేస్తు నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు దండుకుంటున్నారు. దేవరకొండ నగరపంచాయతీలో అధికారులు సమయపాలన పాటిస్తారో లేదో గానీ, కొంత మంది ప్రతినిత్యం ఉదయం 9 గంటలకు కార్యాలయానికి చేరుకుని సాయంత్రం 5గంటల వరకు కార్యాలయంలోనే ఉంటారు. తల్లి కౌన్సిలర్ అయితే కొడుకుల పెత్తనం, భార్య కౌన్సిలర్ అయితే భర్త పెత్తనం కొనసాగుతుంది. ఓ మహిళ కౌన్సిలర్ భర్త నిత్యం అదే పనిలో ఉంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలి



భవన నిర్మాణాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలి. పర్మిషన్ పొందేందుకు దళారులను, మధ్యవర్తులను ఆశ్రయించవద్దు. పట్టణ ప్రజలు గమనించి ప్రతి నిర్మాణానికి, వెంచర్లకు అనుమతులు పొందాలి. లేఅవుట్ లేని అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొంటే నిర్మాణాలకు అనుమతులివ్వడం జరగదు.

- సత్యబాబు, కమిషనర్, మిర్యాలగూడ

రూ.25వేలు ఇవ్వాల్సి వచ్చింది

నాకున్న 250గజాల స్థలంలో ఇల్లు కట్టుకుందామని మునిసిపల్ కార్యాలయానికి వెళ్లితే అనుమతుల కోసం రూ.80వేలు, అనుమతులు త్వరగా ఇచ్చేందుకు తమకు రూ.25వేలు ఇవ్వాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు అడిగారు. చేసేదిలేక రూ.25వేలు ఇచ్చి అనుమతులు తీసుకొని ఇల్లు కట్టుకోవాల్సి వచ్చింది. లేదంటే నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సివస్తుందని అధికారులు అడిగిన డబ్బులు ఇచ్చాను. డబ్బులు ఇవ్వందే పనులు జరగడం లేదు.

- కె.బ్రహ్మం(పేరు మార్చాం), కోదాడ

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



ఇంటి నిర్మాణాలకు అదనంగా డబ్బులు తీసుకుంటున్నట్లు తమ దృష్టికి తీసుకొస్తే తీసుకునే వారిపై చర్యలు తీసుకుంటాము. అదే విధంగా ఇంటి నిర్మాణాలకు ముందే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఎవ్వరికి ఒక రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదు. కొత్తగా ఇల్లు కట్టుకునేవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని లంచాల నివారణకు అడ్డుకట్ట వేయాలి.

- అమరేందర్‌రెడ్డి, కమిషనర్, కోదాడ

చక్రం తిప్పుతున్న జూనియర్ అసిస్టెంట్



కోదాడ : గ్రామ పంచాయతీ నుంచి మునిసిపాలిటీగా మారితే తమ రాతలు మారతాయనుకున్న పట్టణ వాసులకు తలరాతలు మారడం ఏమిటోగాని ఇంటి అనుమతులకు జేబులు తడపాల్సివస్తుంది. చిరు, సామాన్యుడు ఇల్లు కట్టుకోవాలనే కోరిక మధ్య దళారీలు, అవినీతి అధికారులతో నెరవేరే అవకాశం లేదని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 200గజాలలో ఇల్లు కట్టుకోవాలంటే అనుమతుల కోసం రూ.80వేలు మునిసిపాలిటికీ కట్టాల్సి వస్తే మధ్య దళారీలకు, అధికారులకు రూ.10నుంచి రూ.25వేలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఎవ్వరూ ఇళ్లు కట్టాలన్న మునిసిపాలిటీలోని ఓ జూనియర్ అసిస్టెంట్‌ను కలవాల్సిందే. ఆయను కలవకపోతే ఇంటి నిర్మాణ పనులు అడుగు కూడా ముందుకు పడదు. ఆయనకు ముడుపులు చెల్లించుకుంటే టౌన్‌ప్లానింగ్ నుంచి అనుమతులు లభించినట్లేనని పేరు చెప్పటానికి ఇష్టపడని ఓ ఉద్యోగి, ప్రజాప్రతినిధి అంటున్నారు. కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఇవ్వాలంటూ వేలలో వసూలు చేస్తూ నూతన ఇళ్ల నిర్మాణదారుల నుంచి దండుకుంటున్నారని అంటున్నారు.

తలపెట్టు.. మట్టి సంకల్పం



వినాయక చవితి అనగానే నవరాత్రులు గుర్తుకు రాక మానవు. ప్రకృతి హితం కోరుతూ కుల మతాలకతీతంగా నిర్వహించే చవితి పర్వదినం రానే వచ్చింది. ఆగస్టు 25న వినాయక చవితి. దీంతో మండపాల నిర్మాణం, భారీ విగ్రహాల సేకరణకు నిర్వాహకులు సమాయత్తమవుతున్నారు. గతేడాది భారీ విగ్రహాలు ప్రతిష్ఠించిన వారు ఈ సారి మరో అడుగు ఎత్తు ఉండే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే తలంపులో ఉన్నారు. నేడు పట్టణాల్లోనే కాదు పల్లెల్లోనూ భారీ విగ్రహాలు ఏర్పాటు చేయ సంకల్పించారు. అయితే వీరంతా ఒక్క విషయాన్ని మరిచిపోతున్నారు. అదే పర్యావరణ పరిరక్షణ. పర్యావరణానికి హాని కలగనిరీతిలో వినాయక చవితి జరుపుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

- పర్యావరణ హితానికి మట్టి విగ్రహాలే నయం
- ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలతో జలకాలుష్యం
- మట్టి విగ్రహాలతో భక్తి, ముక్తి, పర్యావరణ రక్షణ
- వందల్లో మట్టి విగ్రహాలు... వేలల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు
- మట్టి విగ్రహాలకు పెరుగుతున్న ఆసక్తి
- మట్టి విగ్రహాలకు ఆర్డర్ ఇచ్చిన సూర్యాపేట జిల్లా కలెక్టర్



(భూదాన్‌పోచంపల్లి)

ఇప్పటికైనా నిర్వాహకులు పర్యావరణానికి హాని కలిగించని విగ్రహాలపై దృష్టి సారిస్తే మంచిదని పర్యావరణ హితులు కోరుతున్నారు. మట్టి విగ్రహం ప్రకృతి అందించే రంగులు, ఆకులు, అలుములు వీటితో ముగించే నవరాత్రులు అంద రికీ వెలుగులు అంటున్నారు పర్యావరణ శాస్త్రవే త్తలు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారయ్యే విగ్రహాలు నిమజ్జనం ద్వారా నదులు, చెరువులు, కాలువలను తద్వారా వాతావరణాన్ని కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ఈ ఏడాది విగ్రహాల మండపాల్లో నెలకొల్పేందుకు ముందే అందరూ మేల్కొనాలి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారయ్యే విగ్రహాలు అమ్మ కుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

మట్టితోనే లాభాలు..!



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి విగ్రహాలు

నిమజ్జనం చేసిన వెంటనే మట్టి విగ్రహాలు కరగటం ప్రారంభమవుతుంది. బంకమట్టితో విగ్రహాలు తయారు చేస్తారు. ఆ మట్టి నీటి అడుగున పేరుకుపోయి నీరు ఇంకకుండా దోహదం చేస్తుంది. పూజల్లో ఉపయోగించే ఆకులు, అలుములతో నీటిలో ఉండే సూక్ష్మక్రిములు నశిస్తాయి. జలరాసుల సంపద వృద్ధి చెందుతుంది. ఇంతటి పర్యావరణ హితం ఉంది. కావున మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలి. ఈ విషయంలో ఉత్సవ కమిటీలే కీలక భూమిక పోషించాలి.


కోదాడ/అనంతగిరి/సూర్యాపేటకలెక్టరేట్ : పర్యావరణ హితానికి మట్టి విగ్రహాలే మేలని.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వద్దంటున్నారు పర్యావరణ నిపు ణులు. వినాయక నవరాత్రి ఉత్సవాలను పరస్క రించుకుని భక్తులు వారివారి స్థోమత మేరా వినాయక విగ్రహాలను మండపాల్లో నెలకొల్పి భక్తిని చాటుకుంటారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలను నెలకొల్పి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాడాలని గణేష్ నిమజ్జన కమిటీ నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే గతానికి భిన్నంగా కొంతమంది తయారీదారులు పర్యావరణ మేలును దృష్టిలో ఉంచుకుని ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలకు స్వస్తిపలికి.. మట్టి విగ్రహాల తయారికి పూనుకోవడం గమనార్హం. పట్టణంలోని శ్రీ పోతూలూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం సమీపంలో విశ్వకర్మ మట్టి వినాయక విగ్రహాల తయారీ నిర్వహాకులు మట్టి విగ్రహాలను తయారు చేసి భక్తులకు అందుబాటులో ఉంచారు. ఈ క్రమంలో పర్యావరణ సమతుల్యతే లక్ష్యంగా స్వయాన కలెక్టర్ సురేంద్రమో హన్ 70 విగ్రహాలకు ఆర్డర్ ఇచ్చినట్లు సమా చారం. అదేవిధంగా పట్టణవాసులు సైతం మట్టి విగ్రహాల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలు దగ్గర పడటం, అందుబా టులో ధరలు ఉండటం, పర్యావరణ పరిరక్షణే ల్క్ష్యంగా విగ్రహాల కొనుగోలుకు బాట పట్టారు. దీంతో తయారీ కేంద్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న నరేందర్‌కుమార్

అనర్థాలు ఇవీ..!

- వంద లీటర్ల తాగే నీటిలో ఔన్స్ మోతాదు విషపూరిత రసాయన అవశేషాలు కలిస్తే 36 మందికి క్యాన్సర్, చర్మ, ఊపిరితిత్తుల తదితర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది.
- పీవోపి జిప్సమ్‌తో తయారయ్యే పదార్థం 150 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల వద్ద దీనిని వేడి చేస్తారు.
- పీవోపీతో విగ్రహాల తయారీ సులువు. తక్కువ మంది శ్రామికులతో ఎక్కువ విగ్రహాలు తయారు చేసే అవకాశం ఉంటుంది. దీంతో ఉపాధికి దెబ్బ.
- తయారీ సులువవడంతో లెక్కకు మిక్కిలి విగ్రహాలు తయారు చేస్తున్నారు.
- ఇలాంటి విగ్రహాలు నీటిలో కరగాలంటే ఏళ్ల తరబడి సమయం పడుతుంది. దీంతో జల జీవరాసులు నశించి పోతున్నాయి. జలాశయాల్లో పూడిక పెరిగిపోవడానికి ఈ భారీ విగ్రహాలు కారణమవుతున్నాయి.



అబ్బుర పరుస్తున్న బొజ్జ గణపయ్యలు

ఇటీవల కాలంలో లోపిస్తున్న పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ హరితహారంలో భాగస్వామ్యమై మొక్కలను నాటడంతోపాటు పెంచుతున్నారు. ఇదే క్రమంలో వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జల కాలుష్య నివారణకు మట్టి విగ్రహాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. 9 అంగుళాల విగ్రహం రూ.20, 3 అడుగులు రూ.3వేలు, 6అడుగులు రూ.10వేలు, 9 అడుగుల విగ్రహాలు రూ.16వేలు ధరలు పలుకుతున్నాయి.

మూడేళ్ల క్రితం నవంబరు 29 ఏ వారమవుతుంది?

మెంటల్ ఎబిలిటీ



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

1. ఒక కోడ్ భాషలో PEACEను FEDIUగా రాశారు. అదే కోడ్‌లో FAITH ను ఎలా రాస్తారు?
ఎ) IVLEK బి) KLEVI
సి) EIKLK డి) ఏదీకాదు

2. ఒక కోడ్‌లో GENIUSను TVJOFHగా రాశారు. అదే కోడ్‌లో NATUREను ఎలా రాస్తారు?
ఎ) OBUSVF బి) FSVUBO
సి) UBOVFS డి) ఏదీకాదు

3. ఒక కోడ్‌లో GOODను 76గా రాశారు. అదే కోడ్‌లో HEARను ఎలా రాస్తారు?
ఎ) 67 బి) 58 సి) 49 డి) ఏదీకాదు

4. ఒక కోడ్‌లో STUDENTను FPWDRRRగా రాశారు. అదే కోడ్‌లో TEACHERను ఎలా రాస్తారు?
ఎ) XCUGISC బి) SCXCUGI
సి) IGUCSCX డి) ఏదీకాదు

(5 - 7) ఒక కోడ్ భాషలో
nic sac tic అంటే all are good
sac mic mec అంటే good luck people
tic mec rac అంటే all people nice
పై కోడ్ భాష ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

5. sac నకు సరైన కోడ్?
ఎ) good బి) luck సి) are డి) ఏదీకాదు

6. rac నకు సరైన కోడ్?
ఎ) luck బి) nice సి) all డి) people

7. mec నకు సరైన కోడ్?
ఎ) all బి)good సి)people డి) luck

8. 10, 5.5, 6.5, 15, 64, ------
ఎ) 520 బి) 256 సి) 128 డి) 156

9. 600, 120, 30, 10, 5, ------
ఎ) 6 బి) 8 సి) 4 డి) 5

10. 68, 14, 85, 13, 93, 12, 89, ----
ఎ) 15 బి) 16 సి) 17 డి) 18

11. 5, 6, 11, 17, 28, 45, ------
ఎ) 73 బి) 75 సి) 78 డి) 81

(12 - 14) భిన్నమైన దానిని తెలపండి?

12. ఎ) LOP బి) KPO సి) TGW డి) IRM

13. ఎ) 347 బి) 819 సి) 628 డి) 529


14. ఎ) రాగి బి) తగరం సి) తుత్తినాగం డి) జింక్

15. FAME : GOCH :: KING : --------
ఎ) IPKM బి) IKMP సి) PMKI డి) ఏదీకాదు

16. గడియారంలో సమయం గం7.30నిలు అయింది. నిమిషాల ముల్లు ఈశాన్యాన్ని చూపిస్తోంది అనుకొంటే గంటల ముల్లు ఏ దిక్కును సూచిస్తుంది?
ఎ) పడమర బి) దక్షిణం సి) ఉత్తరం డి) తూర్పు

17. విజయ్ కాలేజీకి వెళ్లాలనుకొన్నాడు. అతను తన ఇంటి నుంచి బయలుదేరాడు. అతని ఇల్లు తూర్పున ఉంది. ఆ రోడ్డు కూడలికి వచ్చిన తరవాత ఎడమవైపున ఆడిటోరియం ఉంది. అతని ఇంటికి ఎదురు రోడ్డులో బ్యాంక్ ఉంది. అయితే కాలేజ్ ఏ దిశలో ఉంది?
ఎ) దక్షిణం బి) ఉత్తరం సి) పడమర డి) తూర్పు

18. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యని తెలపండి?




ఎ) 260 బి) 220 సి) 280 డి) 240

19. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యని తెలపండి?

L_8	N_4	M_{80}
M_4	L_3	N_{25}
N_6	M_8	?

ఎ) L_{100} బి) N_{80} సి) M_{60} డి) L_{120}

20. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్య?



ఎ) 172 బి) 186 సి) 144 డి) 196

21. ఫొటోలో ఉన్న ఒక వ్యక్తిని చూపిస్తూ అజయ్ ఇలా చెబుతున్నాడు. 'అతను నా తల్లి తండ్రికి ఏకైక కుమారుని ఏకైక సోదరి భర్తకు కుమార్తె కొడుకు'. అయితే ఫొటోలోని వ్యక్తి అజయ్‌కు ఏమవుతాడు?
ఎ) మేనమామ బి) మేల్లుడు
సి) అల్లుడు డి) సోదరుడు

22. ఫొటోలో ఉన్న వ్యక్తిని చూపిస్తూ అవినాష్ ఇలా చెబుతున్నారు. 'అతను నా తండ్రి తల్లికి ఏకైక కుమారుడి సోదరి భర్త భార్యకు ఏకైక సోదరుడు.' అయితే ఫొటో లోని వ్యక్తికి అవినాష్ ఏమవుతాడు?
ఎ) అల్లుడు బి) సోదరుడు సి) తండ్రి డి) కుమారుడు

23. AA, BE, FI, OO, -------------
ఎ) EU బి) EV సి)FU డి) FV

24. AZ, CX, FT, JN, --------------
ఎ) DE బి) OF సి) FO డి)EP

25. TE, SF, QI, NN, ----------
ఎ) JU బి) KU సి) IV డి) TV

26. a - c - cbc - b - ca - cbab - a -
ఎ) babacac బి) baaabcc
సి) ababacc డి) ఏదీకాదు

27. aab - dab - cdabc - d - bc - d
ఎ) abcdc బి) bcdcd సి) cbcad డి) ఏదీకాదు

28. వికాస్ దక్షిణానికి 7మీ. నడిచిన తరవాత ఎడమ వైపునకు తిరిగి 9 మీటర్లు నడిచాడు. చివరకు మరల కుడివైపునకు తిరిగి 5మీ. నడిచాడు. అయితే ఇప్పుడు వికాస్ బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఏ దిశలో ఉన్నాడు?
ఎ) 15 మీ నైరుతి బి) 15 మీ వాయవ్యం
సి) 15 మీ ఆగ్నేయం డి) 15 మీ ఈశాన్యం

29. ఒక వరసలో అనిల్ కుడివైపునుంచి 24వ స్థానంలోను, ఎడమవైపునుంచి 17వ స్థానంలోను ఉన్నాడు. అదే వరసలో సునీల్ ఎడమవైపు నుంచి 26వ స్థానంలో ఉంటే కుడి వైపు నుంచి సునీల్ స్థానమెంత?
ఎ) 15 బి) 18 సి) 16 డి) 19

30. ఒక వరసలో నిశాంత్ కుడివైపునుంచి 18వ స్థానంలోను, ఎడమవైపు నుంచి 13వ స్థానం లోను ఉన్నాడు. అదే వరసలో నిరంజన్ తన కుడివైపునకు 5 స్థానాలు జరిగాడు ప్రస్తుతం అతను ఎడమవైపు నుంచి 22వ స్థానంలో ఉన్నట్లయితే కుడివైపు నుంచి నిరంజన్ మొదటి స్థానం ఎంత?
ఎ) 16 బి) 14 సి) 18 డి) ఏదీకాదు

31. ఇంటర్వ్యూని నిర్వహించడానికి మేనేజింగ్ డైరెక్టర్ గం. 10 కంటే 15 నిలు ముందుగా వచ్చారు. ఈ మేనేజింగ్ డైరెక్టర్, ఛైర్మన్ కంటే 30 నిలు ముందుగా వచ్చారు. ఛైర్మన్ ఇంటర్వ్యూ సమయం కంటే 45నిలు ముందు వచ్చారు. అయితే ఆయన ఏ సమయంలో ఇంటర్వ్యూ నిర్వహించదలచారు?
ఎ) గం. 11.00ని. బి) గం. 11.02ని.
సి) గం. 11.15 ని. డి) గం. 11.30ని.

32. అజయ్‌కు అతని తల్లిదండుల పెళ్లి రోజు నవంబరు 11, 15ల మధ్య అని గుర్తు. అతని సోదరి ఆర్తికి నవంబరు 13, 17ల మధ్య అని గుర్తు. అయితే వారి తల్లి దండ్రుల పెళ్లి రోజు ఎప్పుడు?
ఎ) నవంబరు 15 బి) నవంబరు 13
సి) నవంబరు 14 డి) ఏదీకాదు

33. (36 X 1/4) of 4 ÷ 6 x 2 - 8+6ను సూక్ష్మీకరించండి?
ఎ) 36 బి) 10 సి) 42 డి) ఏదీకాదు

34. P అంటే ÷, Q అంటే x, R అంటే -, S అంటే + అయితే 36P4Q5R8S4 విలువ ఎంత?
ఎ) 41 బి) 39 సి) 45 డి) ఏదీకాదు

35. కింది వానిలో సరైన దానిని తెలపండి
ఎ) 18 ÷ 3 X 4 - 5 + 3 = 20
బి) 25 ÷ 5X 3 - 6 + 4 = 15
సి) 35 ÷ 7X 6 - 4 + 7 = 33 డి) ఏదీకాదు

36. SHIPCYS పదంలోని అక్షరాల స్థానాలను మార్చగా ఒక పార్యాంశం పేరు వస్తుంది. ఆ పేరులోని మొదటి అక్షరం ఏమిటి?
ఎ) H బి) P సి) I డి) ఏదీకాదు


37. కింది పదాలను నిఘంటువు ప్రకారం అమర్చిన తరవాత మధ్య ఏర్పడే పదాన్ని తెలపండి?
1. Mango 2. Music 3. Margin
4. Marble 5. Medium
ఎ) Music బి) Mango సి) Medium డి) Margin

38. ఈ రోజు నవంబరు 29 ఆదివారం. ఇది లీపు సంవత్సరమైతే మూడేళ్ల క్రితం నవంబరు 29 ఏ వారమవుతుంది?
ఎ) బుధవారం బి) గురువారం
సి) మంగళవారం డి) ఏదీకాదు

39. సెప్టెంబరు నెలలో ఏ తేదీకి ఏ వారం వస్తుందో అదే తేదీకి అదే వారం వచ్చే తదుపరి నెల ఏది?
ఎ) నవంబరు బి) డిసెంబరు
సి) జనవరి డి) ఏదీకాదు

40. గడియారంలో సమయం గం.2.30 నిలు అయితే గంటల ముల్లు, నిముషాల ముల్లు మధ్య కోణమెంత?
ఎ) 100^0 బి) 90^0 సి) 105^0 డి) ఏదీకాదు

(41-45)



